ఈనాడు
విశాఖపట్నం

సిటీ | ఆదివారం 27 ఆగస్టు 2017 | 24 పేజీలు

ఈనాడు - ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎక్స్‌పోర్ట్ - ఇంపోర్ట్ బిజినెస్ వర్క్‌షాప్ (వివరాలు 16వ పేజీలో)



కత్తులతో రౌడీమూకల వీరంగం

మద్రిపాలెంలో ఒకరి హత్య, మరొకరికి కత్తిపోట్లు

వివరాలు ప్రధాన సంచిక, మినీ 3లో

ప్రజారోగ్యం.. గాల్లో దీపం... 11లో

పండగే.. పండగ!

★ ఇక ప్రతీ నెలా ఉత్సవం ★ నగరం... ఇక పర్యాటక శోభితం

★ ప్రపంచబ్యాంకు రుణంతో బీచ్ అభివృద్ధి

★ త్వరలోనే హెలిటూరిజం ప్రారంభం ★ ఐఎన్ఎస్ విరాట్ ఇక్కడికే..

★ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వెల్లడి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా జిల్లాలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఏటా దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, దీనికి తగ్గట్టుగా పర్యాటక ప్రదేశాలను విస్తృత స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు. వుడా వీసీ బసంత్‌కుమార్, పర్యాటక శాఖ అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కలెక్టరేట్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు, కేంద్రం, ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంతో చేపట్టనున్న పర్యాటక ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

వచ్చే నెల నుంచి ఉత్సవాలు

ఇక నుంచి ప్రతీ నెలా ఏదో ఒక ఉత్సవం జరగనుంది. సెప్టెంబరు చివరి వారంలో 'సౌండ్ ఆన్ ది క్లౌడ్స్ ఆఫ్ వైజాగ్' పేరుతో తొలి ఉత్సవం జరగనుంది. రూ. 2 కోట్లు ఖర్చు కానుంది.

★ అక్టోబరు 7, 8 తేదీల్లో ఫ్లింగ్ ఉత్సవం. ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు రానున్నారు.

★ నవంబరు 11, 12 తేదీల్లో గుర్రాలతో రూ. 2 కోట్లతో శాండ్ మారథాన్.

★ డిసెంబరు 22 నుంచి 25 వరకు రూ. 3 కోట్లతో 'విశాఖ ఉత్సవ్'.

★ జనవరి 22–28 తేదీల మధ్య కుకింగ్ ఒలింపియాడ్.

★ నవంబరు/ డిసెంబరు నెలల్లో ప్రో-కబడ్డీ పోటీలు, విశాఖ-అరకు మధ్య టీఎస్‌డీ కార్ ర్యాలీ

★ నవంబరులో ఏడీటీవోఐ జాతీయ సదస్సు.

★ రూ. 320 కోట్ల ఖర్చుతో పర్యాటక స్థలాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాం. అయిదు బౌద్ధారామాల అభివృద్ధికి కేంద్రం రూ. 110 కోట్లు ఇవ్వనుంది. జిల్లాలో తొట్లకొండ, బావికొండ, బొజ్జన్నకొండ ఉన్నాయి. అరకు ...మిగతా 7లో

మూకుమ్మడి బదిలీ

సూపర్‌బజార్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రక్షాళన

సంయుక్త సబ్‌రిజిస్ట్రారు రత్నకుమార్‌కు మినహాయింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: అవినీతి నిరోధక శాఖ దెబ్బకు సూపర్‌బజారులోని సంయుక్త సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో భారీ ప్రక్షాళన మొదలైంది. సంయుక్త సబ్‌రిజిస్ట్రారు ఎం.వి. రత్నకుమార్ మినహా ...మిగతా 7లో

కొట్లాట సంఘటనలో ఒకరి పరిస్థితి ఆందోళనకరం

ఆరిలోవ : ఈ నెల 20న ముడసర్లోవ సమీపంలోని మామిడితోటలో జరిగిన కొట్లాట కేసులో గాయపడిన ఓ యువకుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం కె.జి. హెచ్.కు తరలించారు. క్రితం ఆదివారం మామిడితోటలో ఆరిలోవ శివాజీనగర్ 2, చినవాల్తేరు ప్రాంతానికి చెందిన రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఇరువర్గాలకు గాయాలు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. గొడవ జరిగిన ఆరు రోజుల తర్వాత చినవాల్తేరుకు చెందిన నీలాపు ఉషాకిరణ్‌కు శనివారం మళ్లీ ఆరోగ్యం విషమించడంతో కె.జి.హెచ్.కు తరలించారు. ఆ కొట్లాటలో తలలో గాజు పెంకు ఉండిపోయినట్లు గమనించిన వైద్యులు శనివారం శస్త్రచికిత్స చేశారు. రక్తం గడ్డ కట్టినట్లు తెలుస్తోంది. చికిత్స కొనసాగుతోంది. పోలీసులు పరిస్థితి సమీక్షిస్తున్నారు.

మత్తు ఇంజెక్షన్లు విక్రయిస్తున్న నిందితుల అరెస్టు

పూర్ణామార్కెట్, న్యూస్‌టుడే: గర్భిణీలకు శస్త్రచికిత్సల సమయంలో ఇచ్చే మత్తు ఇంజెక్షన్లను అక్రమమార్గంలో విక్రయిస్తోన్న ముగ్గురు నిందితులను హార్బర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం సాయంత్రం సీఐ డి. బంగారుపాప ఈ వివరాలను వెల్లడించారు. ఒడిశాలోని రాయగడ జిల్లాకు చెందిన దెబాశిష్ పాటి అలియాస్ అశోక్ సాహు(24), అల్లిపురం, యల్లపువారివీధిలో నివసిస్తోన్న బొండా శ్రీను అలియాస్ లారా(32), వెంకటేశ్వరమెట్టకు చెందిన గంగిరెడ్ల గణేష్(21) ప్రధాన నిందితులుగా ఉన్నారని తెలిపారు. అశోక్ సాహు ఒడిశాలో లభ్యమయ్యే ఈ ఇంజెక్షన్లను ఒక్కోటీ రూ. 5 చొప్పున కొనుగోలు చేసి, వాటిని నగరానికి తీసుకొచ్చి శ్రీను, గణేష్‌లకు రూ. 150 చొప్పున విక్రయిస్తున్నాడన్నారు. వాటిని శ్రీను, గణేష్ మత్తుకు బానిసైన వ్యక్తులకు ఒక్కోటీ రూ. 200 నుంచి రూ. 300 ధరకు అక్రమ మార్గంలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వివరించారు. ఈ క్రమంలో ఇంజెక్షన్లతో కాన్వెంట్ కూడలిలో అనుమానాస్పదంగా సంచరిస్తోన్న ముగ్గుర్నీ ముందస్తు తనిఖీ చేయగా 174 ఇంజెక్షన్లు, రూ. 53,500 నగదు, 3 సెల్‌ఫోన్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ చిరంజీవిరావు, వన్‌టౌన్ ఎస్సై సీహెచ్ వెంకటరావు సిబ్బంది పాల్గొన్నారు.





నిందితుల వివరాలను వెల్లడిస్తున్న హార్బర్ స్టేషన్ సీఐ డి.బంగారుపాప, స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్లు, నగదు, సెల్‌ఫోన్‌లు

మేనత్తకు టోకరా వేసిన అల్లుడు

స్థలం ఇప్పిస్తానని చెప్పి రూ. 5.40 లక్షలతో పరారీ

చేపలుప్పాడ (గ్రామీణ భీమిలి), న్యూస్‌టుడే: సినీఫక్కీలో మేనత్తకు మస్కా కొట్టాడు ఓ మేనల్లుడు. మద్దిలపాలెంలో 32 సెంట్ల స్థలం ఇప్పిస్తానని నమ్మబలికి రూ. 5.40 లక్షలతో ఉడాయించాడు. మోసపోయిన విషయం తెలుసుకున్న బాధితురాలు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమిలి సీఐ బాలసూర్యారావు చెప్పిన వివరాలు... శేషుకుమారి (60) అనే మహిళ చేపలుప్పాడ కూడలిలో గత 15 సంవత్సరాలుగా గుంటూరు మెస్ నిర్వహిస్తున్నారు. ఈమె అన్న కుమారుడు ధనరాజు కొద్దిరోజుల క్రితం ఆమె వద్దకొచ్చాడు. ఆమె కష్టసుఖాలు మాట్లాడుతూ.. ఎంతో కాలం నుంచి ఉంటున్నా నీకు సొంత జాగా లేదని జాలి నటించాడు. తనకు కలెక్టరు కార్యాలయంలో ఓ డిప్యూటీ కలెక్టరు, సీనియరు అసిస్టెంటు తెలుసునని వారి ద్వారా స్థలం ఇప్పిస్తానని నమ్మించాడు. అప్పుడప్పుడూ డిప్యూటీ కలెక్టరు, సీనియరు అసిస్టెంట్ అంటూ ఇద్దరు వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడించేవాడు. సదరు అధికారులు డబ్బులు తీసుకురమ్మన్నారంటూ వారం రోజుల క్రితం చెప్పాడు. మద్దిలపాలెంలో 32 సెంట్ల ఖాళీ స్థలం ఉందని, రూ. 6 లక్షలను అధికారులకిస్తే ఆ స్థలాన్ని మనకు ఇస్తారని నమ్మబలికాడు. ఆ మాయమాటలు నమ్మిన శేషుకుమారి తన వద్ద ఉన్న రూ. 5.40 లక్షలు తీసుకుని ధనరాజుతో కలెక్టరు కార్యాలయానికి వెళ్లారు. ఆ డబ్బు తీసుకున్న ధనరాజు.. అత్తను అక్కడే ఉంచి లోపలికెళ్లాడు. ఆ తరువాత మాయమయ్యాడు. అతను ఎంతకీ రాకపోవటంతో శేషుకుమారి పలుమార్లు ఫోను చేశారు. రోజులు గడుస్తున్నా రాకపోవడంతో తాను మోసపోయిన సంగతిని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అత్యాచార యత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల ఖైదు

తగరపువలస, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారయత్నం, యాసిడ్ దాడికి పాల్పడిన ఘటనల్లో నిందితుడికి చినగదిలి జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి షేక్ సబీనా బేగం మూడేళ్ల శిక్షను విధించినట్లు భీమిలి సీఐ బాలసూర్యారావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటకు చెందిన పొన్నాడ గణపతి (21) 2013లో దాకమర్రి ప్రాంతంలోని ఓ పాలిటెక్నిక్ కళాశాలలో చేరాడు. అదే ఏడాది తమ ఇంటికి సమీపంలో ఉంటున్న 14 సంవత్సరాల బాలికను కళాశాల ప్రాంతానికి అర్ధరాత్రి వేళలో తీసుకొచ్చాడు. ముద్దాడపేట మామిడితోటల్లోకి తీసుకెళ్లి తన కోర్కెను తీర్చాలని బలవంతం చేస్తూ అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. బాలిక ఎదురు తిరగడంతో తన బ్యాగ్‌లో ఉన్న యాసిడ్‌ని ఆమెపై పోశాడు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన జరిగినపుడు నిందితుడి వయసు 17 ఏళ్లు. బాధితురాలి తరపున ఏపీపీ సుధారాణి వాదించారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి బేగం తుదితీర్పు వెలువరిస్తూ నిందితుడికి మూడేళ్ల శిక్ష విధించారు.

అదుపుతప్పి..ఫ్లైయాష్ ట్యాంకర్ బోల్తా

తప్పిన పెనుప్రమాదం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ - లంకెలపాలెం ప్రధాన రహదారిలో ఈ.భోనంగి గంగాధర్ స్టీల్స్ కంపెనీ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ట్యాంకర్ బోల్తా పడింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో ఆ సమయంలో ఎటువంటి వాహనం రాకపోవడంతో పెనుముప్పు తప్పింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రి ఎన్టీపీసీ సైలో నుంచి ఫ్లైయాస్‌ను లోడింగ్ చేసుకుని లంకెలపాలెం వైపు భారీ ట్యాంకర్ బయలుదేరింది. ఈ-భోనంగి వద్ద హఠాత్తుగా ద్విచక్రవాహనం రావడంతో దాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి డివైడర్ మీదుగా దూసుకుపోయి పక్కనున్న రహదారిలో బోల్తా పడింది. ట్యాంకర్‌లో ఉన్న పెందుర్తి ప్రాంతానికి చెందిన డ్రైవర్ గౌతమ్, తాళ్లపాలేనికి చెందిన క్లీనర్ చిరంజీవి స్వల్పగాయాలతో బయటపడ్డారు. పరవాడ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను అక్కడి నుంచి తొలగించారు.



రహదారికి అడ్డంగా బోల్తా పడిన ట్యాంకర్

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

తాటిచెట్లపాలెం : మురళీనగర్ ప్రాంతం తెన్నేటినగర్‌లో కుటుంబ కలహాల కారణంగా ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ్మినేని రవికుమార్(28) న్యూడీల్స్ షాపులో పనిచేస్తున్నాడు. రెండేళ్ళ క్రితం నగరానికి చెందిన అరుద్ర అనే యువతితో వివాహమైంది. పెళ్ళయినప్పటి నుంచి భార్యతో గొడవలు ఉండడంతో రవికుమార్ గత కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. గురువారం ఉదయం భార్యను పుట్టింటి వారు తమ ఇంటికి తీసుకువెళ్లి పోయారు. రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న రవికుమార్ తీవ్ర మనస్థానం చెంది గదిలో ఉరివేసుకొని మృతి చెందాడు. శుక్రవారం ఉదయం ఇంటి యజమాని చౌదరి లక్ష్మణరావు చూడగా విషయం తెలిసింది. సీఐ చంద్రశేఖర్, ఎస్.ఐ. సూర్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

సుజాతనగర్ (పెందుర్తి) : సుజాతనగర్ గొల్లవిల్లివానిపాలెం సమీపంలోని పొదల్లో కుళ్లిన స్థితిలో ఉన్న వృద్ధుడి మృతదేహాన్ని పెందుర్తి పోలీసులు శనివారం కనుగొన్నారు. సీఐ జె.మురళి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లవిల్లివానిపాలెంలో దిగుమర్తి సూర్యారావు (82) అనే అవివాహిత వృద్ధుడు తన అన్న కుమారుడు దిగుమర్తి వెంకటరామన్ ఇంట్లో ఉంటున్నాడు. ఆయన మూగ, చెముడు సమస్యలతో బాధపడుతున్నాడు. ఆరుబయట బహిర్భూమికి వెళ్లే అలవాటు ఉంది. ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సూర్యారావు కనిపించకుండా పోయారని అన్నకుమారుడు వెంకటరామన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గొల్లవిల్లివానిపాలెం పొదల్లో మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఆనవాళ్లు, ఇతర గుర్తుల ఆధారంగా మృతదేహం సూర్యారావుదేనని బంధువులు గుర్తించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తులతో రౌడీ మూకల వీరంగం!

మర్రిపాలెంలో ఒకరి హత్య, మరొకరికి కత్తిపోట్లు ❑ భయభ్రాంతులకు గురైన స్థానికులు

మాధవధార, న్యూస్‌టుడే : మర్రిపాలెం ప్రాంతంలో శుక్రవారం రాత్రి మద్యం మత్తులో కత్తులు చేతపట్టి అల్లరిమూకలు సృష్టించిన బీభత్సం స్థానికుల్ని భయభ్రాంతులకి గురిచేసింది. మర్రిపాలెం జంక్షన్‌లో ఉంటున్న వినయ్ (24), జ్ఞానాపురానికి చెందిన అతని మిత్రులతో కలిసి నగేష్ (29)పై కత్తులతో దాడిచేస్తుండగా అడ్డుకోబోయిన కొశెట్టి రాజు (28)ని విచక్షణ రహితంగా పొడిచి హత్య చేశారు. ఈ సంఘటనలో నగేష్ గాయాలతో బయటపడ్డాడు.





మృతుడు రాజు (దాచిన చిత్రం), విషాదంలో భార్య స్వర్ణకుమారి

మృతిచెందిన రాజు నాలుగు చక్రాల వాహనంపై నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈయనకు భార్య కె.స్వర్ణకుమారి, పాప గాయత్రి (5), బాబు రితిష్(3) ఉన్నారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు పని ముగించుకొని, వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను చూసి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, అర గంటలోనే హత్యకు గురైనట్లుగా సమాచారం వచ్చిందని భార్య విలపించింది. వీరిది ప్రేమ వివాహం. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న రాజు హత్యకు గురికావడంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

★ రోడ్డు పైకి వచ్చి గొడవకు కారణమైన వినయ్ జ్ఞానాపురం ప్రాంతానికి చెందినవాడు. రెండు నెలల క్రితమే ఈ ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. ఇంట్లో భార్యతో గొడవపడి సమీపంలోని మద్యం దుకాణంలో మద్యం తాగి రోడ్డు పైకి వచ్చి కత్తులతో వీరంగం సృష్టించాడని స్థానిక ప్రజలు చెబుతున్నారు. దీంతో స్థానికులు ఇతని వీరంగం చూసి పట్టుకొని కత్తుల్ని తీసుకోవడంతో, మరింతగా రెచ్చిపోయి కనపడిన వారందరిపైనా దాడి చేసేందుకు ప్రయత్నించాడు. పట్టుకొని పోలీసులకు అప్పగించేందుకు స్థానికులు ప్రయత్నించగా పారిపోయాడు. జ్ఞానాపురంలో ఉన్న మిత్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారంతా కత్తులతో వాహనాలపై అక్కడకు వచ్చారు. తన కత్తులను లాక్కొని, పట్టుకోవడానికి ప్రయత్నించిన నగేష్ అక్కడే ఉండటంతో అతనిపై దాడి చేశారు. అతను పారిపోతుండగా, అదే ప్రాంతానికి చెందిన కె.రాజు కిరాణా దుకాణం వద్ద ఉండి గమనించి, వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా పొడిచి చంపేశారు. హత్యకు పాల్పడిన వారంతా 18 నుంచి 22 ఏళ్లలోపు వారని స్థానికులు ప్రజలు చెబుతున్నారు.



గాయాలతో నగేష్

గోప్యత పాటిస్తున్న పోలీసులు

కత్తులతో బీభత్సం సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలుగజేసిన ముఠా గురించి సమాచారం ఇవ్వడానికి పోలీసులు ముందుకు రావడం లేదు. శుక్రవారం రాత్రి హత్య జరిగితే హత్యకు కారణమైన వారి వివరాలను తెలియజేయకుండా సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. కేసు పట్ల పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తుండటంతో, సమాచారం ఇవ్వడానికి ముందుకు రావడం లేదని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

రాత్రి గస్తీ లేకపోవడం వల్లే..

బ్లూకోల్ట్స్, ఢీకోల్ట్స్, విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీ... ఇలా పలు విధాలుగా పోలీసులు ప్రజలకు రక్షణగా నిలుస్తున్నట్లుగా చెబుతున్నప్పటికీ అవేవీ క్షేత్రస్థాయిలో కానరావడం లేదన్నది ఈ సంఘటన తేటతెల్లం చేస్తోంది. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడవలసిన పోలీసులు తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తుండటంతో ఈ ప్రాంతంలో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. మర్రిపాలెం జంక్షన్‌లో మూడు మద్యం దుకాణాలు ఉండటం, వీటి వద్ద పోలీస్ గస్తీ సక్రమంగా లేకపోవడంతో నిత్యం తగాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు. సమయ పాలన లేకుండా ఇష్టం వచ్చినట్లుగా మద్యం దుకాణాలు తెరిచి మద్యం విక్రయిస్తున్నా కనీసం పోలీసులు పట్టించుకోవడం లేదంటున్నారు. తక్షణమే పోలీసులు ఈ ప్రాంతంలో గట్టి నిఘాను ఏర్పాటు చేసి శాంతి భద్రతలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



మాడుగులలో కలెక్టర్ పల్లెనిద్ర

పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ శనివారం రాత్రి మాడుగుల మండలం తాటిపర్తి గిరిజన గ్రామంలో పర్యటించారు. సాయంత్రం అధికారులతో కలిసి గ్రామానికి చేరుకున్న ఆయన గ్రామస్థుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సభలో ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. రాత్రి తొమ్మిది గంటల వరకు గ్రామంలో ఉన్న ఆయన రాత్రి 10 గంటల సమయంలో మాడుగుల చేరుకున్నారు. ఇక్కడే భోజనం చేసి రాత్రి బస చేశారు. – న్యూస్‌టుడే, మాడుగుల గ్రామీణం

నిజజీవితంలో కన్యాశుల్కం పాత్రలు: ఏయూ వీసీ


ఏయూ ప్రాంగణం: కన్యాశుల్కం నాటకంలోని పాత్రలు సమాజంలో నిత్యం మన చుట్టూ తిరిగేవేనని ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురజాడ కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాల్లో భాగంగా ఏయూలోని ప్లాటినం జూబ్లీ సెమినార్ హాలులో శనివారం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వీసీ ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ ఎంతో దూరదృష్టితో కన్యాశుల్కం రచించారన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకం ఎంతో గొప్పదన్నారు. ఎల్.ఆర్.స్వామి, ఆకెళ్ల రాఘవేంద్ర, చాగంటి తులసి, ఎఎస్ పిఎస్ రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య నాగేశ్వరరావు

దుర్గాగణపతికి 432 కిలోల లడ్డు

సీతంపేట, న్యూస్‌టుడే : గణపతి నవరాత్రులు సీతంపేటలో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కోలాహలంగా నిర్వహించిన గణేషుని పూజలు రెండో రోజుకూడా అంతే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలో ప్రధానమైన గణపతి ఆలయాల్లో ఒకటైన సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో తొలిరోజునుంచే పూజలు ప్రారంభమయ్యాయి. రెండో రోజు శనివారం విష్ణుమూర్తి అలంకరణలో శంకుచక్రాలు ధరించి దుర్గాగణపతి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఆలయానికి సుమారు రూ. 80వేల ఖర్చుతో కోండ్రు కాశీవిశ్వనాధం దంపతులు 432 కిలోల భారీ లడ్డును సమర్పించారు. గతేడాదికంటే రెండువందల కిలోల అధికమని ఆలయ కమిటీ కన్వీనర్ ఇమంది రమణ చెప్పారు. సీతంపేట ప్రధాన రహదారిలో ఈ ఆలయం ఉండడంతో భక్తులు భారీగా వస్తున్నారు. ఈ సందర్భంగా తొమ్మిదిరోజులు తొమ్మిది అలంకరణలతో విఘ్నేశ్వరుడు భక్తులకు దర్శనమివ్వనుండగా భక్తులను అలరించడానికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



రెండోరోజు విష్ణుమూర్తి అవతారంలో దుర్గాగణపతి

అంతర్గత శిబిరాలతో ఆత్మస్థైర్యం పెంపు

ఎన్.సి.సి. శిబిరం కమాండర్ సంజీబ్ సర్కార్

సింధియా, న్యూస్‌టుడే: అంతర్గత పోటీల వల్ల కేడెట్లలో ఆత్మస్థైర్యం పెరగడానికి దోహదపడుతుందని నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్.సి.సి) శిబిరం నిర్వాహకులు కమాండర్ సంజీబ్‌సర్కార్ అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో త్రీ-ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఐజీసీ శిబిరంలో శనివారం కేడెట్లను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి నేవీ, ఆర్మీ, వాయుసేన విభాగాల నుంచి 600 మంది కేడెట్లకి ఈనెల 30 వరకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. రైఫిల్ డ్రిల్, రైఫిల్ షూటింగ్, ఈతపోటీలు, బోటు పుల్లింగు, నౌకల నమూనాల తయారీ, సాంస్కృతిక, పెరేడ్, వైద్యం, ఆరోగ్యం వంటి అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. శిబిరం ముగింపులో విజేతలను ఎంపిక చేసి ఈనెలలోనే జరిగే మరో ప్రత్యేక శిబిరానికి పంపుతామన్నారు.

మాట్లాడుతున్న ఎన్.సి.సి. శిబిర నిర్వాహకులు కమాండర్ సంజీబ్‌సర్కార్



ఈశాన్య రాష్ట్రాల్లో వరదలతో పలు రైళ్ల రద్దు

హౌవ్‌డా వరకూ ప్రత్యామ్నాయ సర్వీసులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా ఉత్తర సరిహద్దు రైల్వే కటిహార్ డివిజన్‌లో పలు రైల్వే మార్గాలు దెబ్బతినడంతో తూర్పు కోస్తా రైల్వే మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు తూ.కో. రైల్వే వాల్తేర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ జి.సునీల్‌కుమార్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లను బెంగళూరు, త్రివేండ్రం, సికింద్రాబాద్‌ల నుంచి హౌవ్‌డా వరకూ రాకపోకలు సాగించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రద్దైన రైళ్లు... ఈ నెల 27, సెప్టెంబరు 3 తేదీల్లో త్రివేండ్రం-గువాహటి (12515) ఎక్స్‌ప్రెస్ ★ 28, 29 తేదీల్లో గువాహటి-బెంగళూరు (12510) ఎక్స్‌ప్రెస్ ★ 28న గువాహటి-సికింద్రాబాద్ (07510) ప్రత్యేక రైలు ★ 28న చెన్నై ఎగ్మోర్-గువాహటి ఎక్స్‌ప్రెస్ (15629) ★ 29న కామాఖ్య-బెంగళూరు కంటోన్మెంట్ (12504) ఎక్స్‌ప్రెస్ ★ 29న త్రివేండ్రం - గువాహటి (12507) ఎక్స్‌ప్రెస్ ★ 30న గువాహటి-త్రివేండ్రం (12516) ఎక్స్‌ప్రెస్ ★ 30న కామాఖ్య-యశ్వంత్‌పూర్ (12552) ఎక్స్‌ప్రెస్ ★ 31న గువాహటి-సికింద్రాబాద్ (12514) ఎక్స్‌ప్రెస్ ★ 31న కామాఖ్య-పూరీ (15644) ఎక్స్‌ప్రెస్ ★ 31న తాంబరం-డిబ్రూగఢ్ (15929) ఎక్స్‌ప్రెస్ ★ 31న కన్యాకుమారి-డిబ్రూగఢ్ (15905) ఎక్స్‌ప్రెస్

ప్రయాణికుల సౌకర్యార్థం కల్పించిన ప్రత్యేక రైళ్లు

ఈ నెల 27న: ★ హౌవ్‌డా-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (07183) ★ త్రివేండ్రం-హౌవ్‌డా మధ్య ఎక్స్‌ప్రెస్(06515) ★ హౌవ్‌డా-బెంగళూరు మధ్య ఎక్స్‌ప్రెస్(02502)

ఈనెల 31న: ★ హౌవ్‌డా-త్రివేండ్రం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (06516)

బీసీల రాజకీయ భవితపై కార్యాచరణ

గురుద్వారా, న్యూస్‌టుడే: బీసీల హక్కుల సాధనకు గుంటూరులో ఆదివారం నిర్వహించబోయే రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశానికి నగరం నుంచి బీసీ నాయకులు పయనమవుతున్నట్లు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గొలగాని కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం సంఘం నగర అధ్యక్షుడు బుగత నర్సింగరావు అధ్యక్షతన సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వెనుక ప్రాంతంలో గల కార్యాలయంలో నాయకులతో ఆయన సమావేశమయ్యారు. బీసీల రాజకీయ చైతన్యం కోసం భవిష్యత్ కార్యాచరణపై అక్కడ చర్చ జరుగుతుందన్నారు. ఇందులో బీసీలు రాజకీయ పార్టీ నెలకొల్పడం, రాష్ట్రస్థాయిలో కోర్ కమిటీ వేయడం వంటి అంశాలపై చర్చ నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేషగిరి, ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరవ రాంబాబు, గౌరవ అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గొర్లె శ్రీనివాస్‌నాయుడు, మహిళా అధ్యక్షురాలు రాజగిరి ఉదయగౌరి, శీలం నాగేశ్వరరావు, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కిశోర్, నరవ రాంబాబు, నర్సింగరావు, తదితరులు



అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం, న్యూస్‌టుడే: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి. నాగార్జునరెడ్డి శనివారం అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామచంద్ర మోహన్, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కప్పస్థంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన మండపంలో పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈవో స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పెందుర్తి

భారీ అన్నదానాలకు ఏర్పాట్లు

వేపగుంట, న్యూస్‌టుడే : గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వరలక్ష్మీనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ ఎత్తున అన్న సంతర్పణ జరుగుతుందని వరలక్ష్మీనగర్ యూత్ క్లబ్ సభ్యులు తెలిపారు. 69వ వార్డు ప్రశాంతినగర్‌లో ఆదివారం, గౌతంనగర్‌లో వచ్చేనెల 2న అన్న సంతర్పణలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 55వ వార్డు పరిధిలోని పరవాడ హిందుజా విద్యుత్ కేంద్రం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్2 డి.ఇ. రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పాలవలస, పిట్టవానిపాలెం, దేవాడ గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.



వేపగుంట హైస్కూలు ఎదురుగా బాంబ్లాస్టింగ్ యూత్ సభ్యులు 12అడుగుల ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



తానాంలో కన్నూరు యువసేన ఆధ్వర్యంలో.. ఆర్మీ దళపతిగా.. గణపతి



పరవాడ బొంకులదిబ్బ వీధిలో..



పెందుర్తి దొగ్గవాని పాలెంలో 16అడుగుల మహాగణపతి



ప్రహ్లాదపురంలో 21 అడుగుల శ్రీరామావతారం గణపతి

దండాలయ్యా... ఉండ్రాలయ్య

విఘ్నాలను తొలగించి... విజయాలను కలిగించు స్వామీ... అంటూ భక్తులు ఉండ్రాలయ్యను... మనసారా కొలిచారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో వినాయక పూజలు ఘనంగా జరిగాయి. యువజన సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో మండపాలను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. పండ్లు, ఫలహారాలు సమర్పించి పత్రి పూజలతో అర్చించారు.

–న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం



శానాతివానిపాలెంలో స్వామి కోసం పర్ణశాల



సబ్బవరం మారుతీ కూడలిలో వీణాధర గణపతి



సత్తివానిపాలెంలో యువ సేన యూత్ ఆధ్వర్యంలో..



కలపాక దుర్గమాంబకాలనీలోని అపార్టుమెంట్ సెట్‌లో కొలువుదీరిన గణపయ్య



వేపగుంట ముత్యమాంబ యూత్ ఆధ్వర్యంలో



కైలాసంలో శివపార్వతుల నడుమ ఆకట్టుకుంటున్న గణపయ్య



లక్ష్మీనరసింహనగర్ పార్కులో కాణిపాకం గణపతిగా..



కోటనరవ ఫ్రెండ్స్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో..




వరలక్ష్మీనగర్‌లో సురేష్‌గాడ్స్ యూత్ ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ



దేశపాత్రునిపాలెంలో...



గణపతి ముగ్గు



లక్ష్మీనరసింహనగర్ 72వ వార్డులో..



వాడచీపురుపల్లిలో ఎంపీపీ మాసవరపు దంపతుల పూజలు



వెన్నెలపాలెం రామాలయం వద్ద గణపతి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే బండారు దంపతులు



పెందుర్తి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిమ వద్ద ఎంపీపీ రెడ్డి వరలక్ష్మీ, పూజలు

పెందుర్తి

నల్లరేగులపాలెంలో ఆక్రమణలపై ఫిర్యాదు

సబ్బవరం: సబ్బవరం మండలం నల్లరేగులపాలెం గ్రామంలోని సర్వేనెం 9/4లో చెరువును, సర్వేనెం. 10లో శ్మశానవాటికలోని సుమారు 2ఎకరాలు, కొండ మెట్ట సర్వేనెం. 10/5, 11/1, 11/2లో ఉన్న 10 ఎకరాలను కొందరు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ఆక్రమించుకున్నారని, గ్రామానికి చెందిన పలువురు శనివారం సబ్బవరం తహసిల్దారుకు ఫిర్యాదు చేశారు. ఆ భూములను తాము పూర్వకాలం నుంచి అనుభవిస్తున్నామని, ఆక్రమణలకు పాల్పడిన వారు తమను భూముల్లోకి రానివ్వడం లేదనివాపోయారు. వారి నుంచి భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

పెందుర్తి సినిమాలు

లక్ష్మీకాంత్ స్ర్కీన్ 1:
జయ జానకి నాయక

స్ర్కీన్ 2:
ఆనందోబ్రహ్మ

'రైతు రథం'.. అన్నదాతకు వరం

- నియోజకవర్గానికి 66 ట్రాక్టర్లు మంజూరు
- దరఖాస్తుకు ఈనెల 31 తుది గడువు

వ్యవసాయాన్ని యాంత్రీకరణ దిశగా తీసుకెళ్లడానికి ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోంది. వీటి కింద రైతులకు పలు ప్రోత్సాహకాలను కూడా అందిస్తోంది. దుక్కు దున్నడం నుంచి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేవరకు రైతుకు ట్రాక్టర్ అవసరం. ఇందులో భాగంగా రైతులకు అండగా నిలవడానికి ప్రభుత్వం రైతురథం పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసే రైతులకు ఈ పథకం కింద రాయితీపై ట్రాక్టర్లను అందిస్తోంది. పెందుర్తి నియోజకవర్గానికి మొత్తం 66 ట్రాక్టర్లు మంజూరయ్యాయి. రైతులు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31 తుది గడువుగా నిర్ణయించారు. – న్యూస్‌టుడే, పరవాడ


ట్రాక్టరుతో పొలం దుక్కుతున్న దృశ్యం (పాతచిత్రం)

పెందుర్తి నియోజకవర్గానికి మొత్తం 66 ట్రాక్టర్లు మంజూరయ్యాయి. అందులో పరవాడ మండలానికి 4డబ్ల్యూడీ రకం 2, 2డబ్ల్యూడీ రకం 19 ట్రాక్టర్ల చొప్పున మొత్తం 21 మంజూరయ్యాయి. సబ్బవరం మండలానికి 4డబ్ల్యూడీ రకం 4, 2డబ్ల్యూడీ రకం 20 చొప్పున మొత్తం 24 ట్రాక్టర్లు మంజూరు చేశారు. పెందుర్తి మండలానికి 4డబ్ల్యూడీ రకం 2, 2డబ్ల్యూడీ రకం 19 చొప్పున మొత్తం 21 ట్రాక్టర్లు మంజూరు చేశారు. వీటిని జనరల్, ఎస్సీ కేటగిరీల్లో కేటాయిస్తారు.

రాయితీ ఇలా...

- ✦ లబ్ధిదారులు తమకు నచ్చిన ట్రాక్టరును ఎంపిక చేసుకోవచ్చు. ట్రాక్టరు ఖరీదు రూ. 5.75 లక్షల నుంచి రూ. 8.50 లక్షల వరకు ఉంటుంది.
- ✦ ప్రభుత్వం 2డబ్ల్యూడీ హార్స్‌పవర్ ట్రాక్టరుపై రాయితీగా రూ. 1.50 లక్షలు, 4డబ్ల్యూడీ హార్స్‌పవర్ ట్రాక్టర్‌పై రూ. 2లక్షలు రాయితీగా ఇస్తోంది.
- ✦ ట్రాక్టర్ల హార్స్ పవర్ 39 నుంచి 55 వరకు ఉంటుంది. రాయితీపోను మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుడు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.
- ✦ ట్రాక్టరుకు అనుసంధానంగా వ్యవసాయానికి ఉపయోగపడే యంత్రాలను కూడా రాయితీపై అందజేస్తారు.

దరఖాస్తు విధానం..

ట్రాక్టర్లు కావాల్సిన రైతులు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి. అక్కడ దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తు పూరించి దానికి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నకలుతోపాటు ఒక పాసుపోర్టు సైజు ఫొటోను జతచేసి రూ. వెయ్యి మీసేవలో చెల్లించి ఆన్‌లైన్ చేసుకోవాలి. దరఖాస్తు మీసేవ నుంచి మండల వ్యవసాయాధికారికి, అక్కడి నుంచి ఏడీఏకి, మళ్లీ అక్కడి నుంచి జేడీఏకి వెళ్తుంది. జేడీఏ నుంచి దరఖాస్తు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి వెళ్తుంది. ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ట్రాక్టర్లను అందిస్తారు. ప్రతి ట్రాక్టరును జియో ట్యాగింగ్ చేస్తారు.

అర్హులు ఎవరంటే....

★ ఈ పథకంలో ట్రాక్టరును రాయితీపై పొందాలంటే కనీసం రెండు ఎకరాల పంట భూమి లబ్ధిదారుని పేరు మీద ఉండాలి. ★ లబ్ధిదారులు ఇప్పటి వరకు వ్యవసాయశాఖ ద్వారా ఎటువంటి యంత్రం పొంది ఉండరాదు ★ ఇప్పటికే సొంత ట్రాక్టరు ఉన్నవారు ఈ పథకానికి అనర్హులు.

నిబంధనలు ఇవీ..

రాయితీపై ట్రాక్టరు పొందిన రైతులు వ్యవసాయశాఖ నిబంధనలు తప్పకుండా పాటించాల్సిందే. ఐదేళ్లపాటు ట్రాక్టరు ఆ గ్రామంలో తప్పకుండా ఉపయోగపడాలి. ట్రాక్టరును క్రయవిక్రయాలు చేసుకునే హక్కు రాయితీపై ట్రాక్టరు పొందిన లబ్ధిదారునికి లేదు. ఇలా నిబంధనలు ఒప్పుకుని హామీపత్రం ఇచ్చిన వారికే ట్రాక్టరు మంజూరు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



కూలీల కొరతను అధిగమించవచ్చు..



రైతురథం పథకంలో భాగంగా ప్రభుత్వం రాయితీపై అర్హులకు ట్రాక్టరును అందజేస్తోంది. ట్రాక్టర్లు కావాల్సిన వారు ఈనెల 31లోగా వ్యవసాయాధికారులను సంప్రదించి మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి. రైతుల వద్ద ట్రాక్టర్లు ఉంటే వ్యవసాయ యాంత్రీకరణ పెరగడంతో పాటు ప్రస్తుతమున్న కూలీల కొరతను అధిగమించవించవచ్చు. పెట్టుబడులు తగ్గుతాయి. వర్షాలు పడిన వెంటనే దుక్కులు చేసి సాగు ప్రారంభించడానికి వీలుంటుంది. ట్రాక్టర్లు పొందినవారు గ్రామాల్లో అందుబాటులో ఉంచాలి. ఈ పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ శాఖ నిబంధనలు తప్పకుండా పాటించాలి.

– బి.విజయప్రసాద్, వ్యవసాయ సహాయ సంచాలకులు, విశాఖడివిజన్

'తెలుగు భాషను బతికించుకుందాం..'


విద్యార్థినికి పెద్దబాలశిక్ష అందిస్తున్న శ్రీరాంమూర్తి

సబ్బవరం: ఆంగ్ల మాధ్యమంపై మోజు కారణంగా తేనెలూరే తెలుగు భాష మృత భాషగా మారిపోతోందని సబ్బవరానికి చెందిన విశ్రాత ఉపాధ్యాయుడు బోకం శ్రీరాంమూర్తి ఆవేదన వ్యక్త చేశారు. తన జన్మదినం సందర్భంగా శనివారం సబ్బవరం ప్రభుత్వ హైస్కూలు విద్యార్థులు సుమారు 150మంది విద్యార్థులకు పెద్దబాల శిక్ష పుస్తకాలను పంపిణీ చేశారు. తెలుగు భాష పరిరక్షణకు గత 10 సంవత్సరాలుగా విద్యార్థులకు పెద్దబాల శిక్ష పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ పెద్దబాల శిక్ష చదివితే అపార జ్ఞానం పెరుగుతుందన్నారు. విశ్రాంత ఎంఈవో బి.క్రాంతిదాస్ విద్య ఆవశ్యకత, పుస్తక సేకరణ, పఠనాభిలాష, సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. మహాభారతం, రామాయణం, భాగవతం చదవడం వల్ల మన సంస్కృతిపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో యోగ గురువు పి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమానికి వితరణ

సబ్బవరం: సబ్బవరం మండలం తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన ఓ నేత తన పుట్టిన రోజును పురస్కరించుకుని లక్ష్మీ పురంలోని అంధుల ఆశ్రమంలోని 40మంది విద్యార్థులకు దుప్పట్లు, చాపలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. రొంగలి జగన్నాథం, డెక్క దేముడుబాబు, బోకం జగ్గునాయుడు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోబోల్తా.. మహిళలకు గాయాలు

ప్రహ్లాదపురం (వేపగుంట), న్యూస్‌టుడే : ఆటో బోల్తా పడి అందులోని ప్రయాణికులకు గాయాలయ్యాయి. శుక్రవారం కొంత మంది మహిళలు ఆటోలో సింహాచలం నుంచి గోపాలపట్నం ప్రయాణిస్తున్నారు. శ్రీనివాసనగర్ వద్దకు వచ్చేసరికి ఆటోకు అడ్డంగా ఓ కుక్క రావడంతో డ్రైవరు హఠాత్తుగా బ్రేకు వేశాడు. దీంతో ఆటో ఒక్కసారిగా బోల్తా కొట్టి పక్కనే ఉన్న డివైడరు పైకి ఎగిసి పడింది. ప్రమాదంలో ఆరుగురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే సహచర ఆటోడ్రైవర్లు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

నేరాల నివారణపై అవగాహన

వేపగుంట, న్యూస్‌టుడే: నేరాలకు పాల్పడే వారి గురించి పోలీసులకు తెలియజేసి సహకరించాలని పెందుర్తి నేర విభాగం ఎస్ఐ జి.దేముడుబాబు కోరారు. పెందుర్తి పోలీసుల ఆధ్వర్యంలో శనివారం 72వ వార్డు పరిధి అప్పన్నపాలెంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నేరాల నివారణపై అవగాహన సదస్సు జరిగింది. ఎస్ఐ దేముడుబాబు మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇక్కడ నివాసం ఉంటున్నారన్నారు. వీరిలో కొందరికి నేర చరిత్ర ఉన్న నేపథ్యంలో, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ సంఘం కార్యదర్శి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్తంభంపై నుంచి పడి లైన్‌మెన్‌కు గాయాలు

పరవాడ: స్తంభంపై నుంచి జారిపడి ఆర్ఈసీఎస్ లైన్‌మెన్ కె.సూర్యనారాయణ(45)కి గాయాలయ్యాయి. ఈ సంఘటన వాడచీపురుపల్లిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాడచీపురుపల్లి కూడలిలో విద్యుత్తు సమస్యపై ఫిర్యాదు రావడంతో సూర్యనారాయణ స్తంభంపైకి ఎక్కాడు. ఈ క్రమంలో విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై స్తంభం నుంచి పడిపోవడంతో గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాజువాకలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

పెందుర్తి, న్యూస్‌టుడే: మదర్ థెరిసా 107వ జయంతిని పెందుర్తి పాత ఊరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీలా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని పాఠశాల ఆవరణలోని మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు పీలా జితేంద్ర, పి.శ్రీను, వి.అప్పారావు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారంను తొలగించాలని ఆందోళన

పరవాడ, న్యూస్‌టుడే: తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న కోళ్లఫారం(హేచరీ)ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ పి.భోనంగి పంచాయతీ పరిధిలోని వి.ఎల్.ఎన్. పురం గ్రామస్థులు శనివారం ఆందోళన చేపట్టారు. వీరంతా గ్రామానికి సమీపంలో ఉన్న హేచరీ వద్దకు చేరుకుని యాజమాన్యం తీరుపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పైలా అప్పారావు, చల్లా కళ్యాణి, బండారు సాయికుమార్ తదితరులు మాట్లాడుతూ కోళ్లపారం కారణంగా గత మూడు వారాలుగా ఈగలు వృద్ధి చెంది గుంపుగుంపులుగా ఇళ్లల్లోకి వస్తుండడంతో కంటినిండా నిద్ర కరవై నరకయాతన పడుతున్నామని మండిపడ్డారు. ఆహారపదార్థాలపై ఈగలు వాలడంతో తిండి తినలేని పరిస్థితి నెలకొందని, రోగాల బారిన పడుతున్నామన్నారు. విషయాన్ని యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


భరణికంలో ప్రజలే ముందు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

పరవాడ, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రాత్రి భరణికం గ్రామంలో చేపట్టిన 'ప్రజలే ముందు' కార్యక్రమాన్ని ఎంపీపీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. మండలస్థాయి అధికారుల బృందంతో కలిసి గ్రామంలో దోమలపై దండయాత్ర ర్యాలీని చేపట్టి ఫాగింగ్ చేయించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామప్రజలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు గ్రామంలోని సమస్యల పరిష్కారానికి ప్రతివారం ఒక పంచాయతీలో ప్రజలే ముందు కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీపీ వెల్లడించారు. సర్పంచి బొండా తాతారావు, మండలప్రత్యేకాధికారి విజయప్రసాద్, ఎంపీడీవో కరుణకుమారి, తహసిల్దారు మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురంలో...

పెందుర్తి: ప్రజలే ముందు (పీపుల్ ఫస్ట్) కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిషత్ అధికారులు ఎస్ఆర్‌పురం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీపీ రెడ్డి వరలక్ష్మీ నారాయణరావు, మండల ప్రత్యేకాధికారిణి పి.ప్రసన్నవాణి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న 29అంశాలకు సంబంధించిన వివరాలను గ్రామస్థులకు తెలియజేశారు. రాత్రికి గ్రామంలోనే నిద్రించారు. ఎంపీడీవో బి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, సర్పంచి దూది సుందరమ్మరమణ, ఎంపీటీసీ గొల్లవిల్లి సంతోషికుమారి, తహసీల్దార్ లాలం సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం మండలం వంగలిలో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం వంగలి గ్రామంలో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్బవరం మండల ప్రత్యేకాధికారి కె.ఎస్.శాస్త్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచి వేపాడ స్వామినాయుడు మాట్లాడుతూ వంగలిలో హైస్కూలు నిమిత్తం 5ఎకరాల భూమి ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో తహసిల్దారు పి.రామారావు, మండల విద్యా శాఖాధికారి ఆర్ఆర్‌కే నర్సింగరావు, ఈవోఆర్డీ కె.సూర్యనారాయణ, వీఆర్వో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి) పరిసర ప్రాంతాలను కలుపుకొని టూరిస్టు సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిధులివ్వడానికి ముందుకొచ్చింది. డీపీఆర్‌లు తయారుచేస్తున్నాం.

✦ కోస్టల్ బ్యాటరీ నుంచి కైలాసగిరి వరకూ ఉన్న బీచ్ ముందు భాగాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 100 కోట్లు రుణమివ్వడానికి ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చింది. ఏపీ డిజాస్టర్ రీ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు కింద నిధులు వస్తున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా భూగర్భ విద్యుత్తు వ్యవస్థ, జూపార్కు అభివృద్ధి పనులు చేపట్టనున్నాం.


మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, వుడా వీసీ బసంత్‌కుమార్ తదితరులు

పండగే.. పండగ!

విశాఖ వస్తున్న పర్యాటకుల సంఖ్య
✦ 2015-16 : 6.93 లక్షలు
✦ 2016-17 : 9.09 లక్షలు

✦ 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో పలు ప్రాజెక్టులు చేపట్టాం. కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వచ్చే మార్చి నాటికి, ఇంకొన్ని డిసెంబరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. రూ. 30 కోట్లతో తొట్లకొండ, రుషికొండ, రేవుపోలవరం తదితర ప్రాంతాల్లో బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నాం. మరో రూ. 40.73 కోట్లతో గొలుగొండ జలపాతాలు, కేడీ పేట అల్లూరి సమాధి, తాడిగుడ జలపాతాలు, మంగమారి పేట, యారాడ బీచ్‌ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం.

✦ 2017-18లో రూ. 15 కోట్లతో లంబసింగి, దండుపల్లి ప్రాంతాల్లో రిసార్టులు, ల్యాండ్ పార్కింగ్‌లు వంటి వసతులతో పాటు యారాడ బీచ్‌లో ఫ్లోటింగ్ జెట్టీ ఏర్పాటు, మంగమారిపేట రెండోదశ ప్రాజెక్టు పనులతో, జలక్రీడలకు అనువైన పరిస్థితులను నెలకొల్పే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

✦ ఎం.వి.పి.కాలనీలో అన్ని సదుపాయాలతో రూ. 3 కోట్లతో పర్యాటక భవనం ఏర్పాటు చేస్తున్నాం. దీనికోసం 20 సెంట్ల స్థలం కేటాయించాం.

✦ జిల్లా పర్యాటక ప్రచార మండలి (డీటీపీసీ) కింద పర్యాటక ప్రదేశాల్లో రూ. 4 కోట్లతో వసతులను కల్పిస్తున్నాం.

✦ ఆర్‌కే బీచ్, రుషికొండ తీరాల్లో రూ. 1.50 కోట్లతో సురక్షిత స్విమింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లుచేస్తున్నాం. గజ ఈతగాళ్లతో పాటు బోట్లతో రక్షణ ఏర్పాటు చేసి ఈత కొట్టేందుకు అనువైన ప్రదేశాలను అభివృద్ధి చేయనున్నాం.

✦ సాగరమాల ప్రాజెక్టు కింద భీమిలిలో పర్యాటక జెట్టీ ఏర్పాటు చేయనున్నాం.

✦ **రష్యా పర్యాటక ఆపరేటర్లు విశాఖ వైపు మక్కువ చూపుతున్నారు.**

✦ **ఈసారి దసరా ఉత్సవాలను కొత్తగా నిర్వహించబోతున్నాం. దసరా సెలవుల్లో నాలుగైదు రోజుల పాటు ఇవి సాగనున్నాయి.**

✦ **ఏపీ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్ల రాష్ట్ర స్థాయి సదస్సును విశాఖలో నిర్వహిస్తున్నాం. ప్రతిపాదిత పర్యాటక ప్రాజెక్టులు అమల్లోకి వస్తే భవిష్యత్తులో విశాఖ నగరం మరింత వికాసం చెందనున్నది.**

★ **ప్రముఖ సంస్థల హోటళ్లు రానున్నాయి. వీరికోసం మధురవాడ సర్వే సంఖ్య 409లో 240 ఎకరాలు, యండాడలో 90 ఎకరాలు, భీమిలి బీచ్‌రోడ్డులో 6.87 ఎకరాలు, ముత్యాలమ్మపాలెంలో 12 ఎకరాలు, తెన్నేటిపార్కు వద్ద 3 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి.**

★ **రూ. 700 కోట్ల ఖర్చుతో బీచ్‌రోడ్డులోని ఏపీఐఐసీ స్థలంలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.**

తుది దశకు హెలి టూరిజం...

హెలిటూరిజం ప్రాజెక్టుకు సంబంధించిన పనులు తుదిదశకు చేరుకున్నాయి. డీజీసీఏ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. తొలిదశలో సింగిల్ ఇంజన్‌తో హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి తెస్తాం. నగర పరిధిలో ప్రాంతాలను చుట్టి రావడానికి ఇది ఉపకరిస్తుంది. రెండో దశలో రెండు ఇంజిన్ల సహాయంతో నడిచే హెలికాప్టర్లు వస్తాయి. వీటిపై అరకు వరకూ వెళ్లి రావచ్చు. తొలుత ప్రయోగాత్మక పరీక్ష నిర్వహించేందుకు రెండు నెలల పాటు ప్రైవేటు సంస్థకు ఇస్తాం. నిర్వహణ బాగుంటే పూర్తిస్థాయిలో వుడా ఒప్పందం కుదుర్చుకుంటుంది. ముఖ్యమంత్రి తదుపరి పర్యటనలో వీటి ప్రారంభోత్సవాలను చేయనున్నాం.

విశాఖలోనే ఐఎన్‌ఎస్ విరాట్

నౌకాదళ సేవల నుంచి విరామం తీసుకున్న ఐఎన్‌ఎస్ విరాట యుద్ధనౌక మ్యూజియం విశాఖలోనే ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. టెక్నో ఎకనమికల్ ఫీజిబిలిటీ కోసం పీఎంసీని నియమించారు. ఈ సంస్థ అధ్యయనం చేసి నివేదిక ఇస్తుంది. విశాఖలో దీన్ని ఏర్పాటు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. నౌకాదళ సేవల నుంచి విరమణ పొందిన టీయూ-142 యుద్ధవిమాన మ్యూజియం పనులు యుద్ధప్రాతిపదిక జరుగుతున్నాయి.

మూకుమ్మడి బదిలీ

(మొదటి పేజీ తరువాయి) మిగిలిన 8 మందిని అధికారులు బదిలీ చేశారు. ఈ కార్యాలయంపై ఈ నెల 9న అనిశా అధికారులు సాయంత్రం 4 గంటల నుంచి మర్నాడుదయం 6 గంటల వరకూ ఏకబిగిన 14 గంటల పాటు సోదాలు చేసిన సంగతి విదితమే. ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు ఎం.వి.వసంతకుమార్, వి.బసవేశ్వరరావు సహా కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ సహాయకులు వై.కె.సి.పాత్రో, కె.నర్సింగరావు, జూనియర్ సహాయకులు వి.రాజశేఖరరావు, కె.రవికుమార్, కె.సాయి రామచంద్రరావు, ఎ.శ్రీనివాసరావు, ఆఫీసు సబార్డినేట్‌లు ఎం.రామకృష్ణ, వి.జయలక్ష్మిలను విచారించారు. ఈ దాడుల్లో రూ. 2.21 లక్షల నగదు ఆరుగురు దస్తావేజు లేఖర్ల వద్ద లభ్యమైంది. వారిని కూడా అనిశా అధికారులు విచారించారు. ఈ సొమ్ము మొత్తం అవినీతికి సంబంధించినదేనని అనిశా నిర్ధారణకు వచ్చింది. దీంతో సూపర్‌బజార్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తోన్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు సహా మొత్తం పదిమంది ఉద్యోగులపై చర్యలకు సిఫార్సు చేసింది. అనిశా సిఫార్సుల మేరకు వీరిపై చర్యలను తీసుకోవాలని పదిరోజుల క్రితం రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ సరోజ ఆ శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ఇక్కడ పనిచేస్తోన్న వారందరినీ తొలుత బదిలీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. వినాయక చవితి సెలవు ముగియడంతో శనివారమే కొత్తగా నియమితులైన వారు బాధ్యతలు చేపట్టారు.

కీలక వ్యక్తిని పంపకుండా...

సబ్బవరం సబ్‌రిజిస్ట్రార్ కె.నిరంజన్‌కుమార్‌ను ఇక్కడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2గా నియమించడంతో ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేస్తోన్న వి.బసవేశ్వరరావును డీఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. మిగతా సీనియర్, జూనియర్ సహాయకులతోపాటు ఆఫీసు సబార్డినేట్లను జిల్లా రిజిస్ట్రార్, అనకాపల్లి రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఎంవీ ఆడిట్ విభాగాలకు బదిలీ చేశారు. అనిశా దాడుల నేపథ్యంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 ఎం.వి. రత్నకుమార్‌కు మాత్రం బదిలీ చేయలేదు. ఈయన గత కొద్దిరోజుల నుంచి సెలవులో ఉన్నారు. సెలవులో ఉన్న అధికారిని బదిలీ చేసే అవకాశం లేకపోవడం వల్లనే ఆగినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. కీలక వ్యక్తిని బదిలీ చేయకుండా తమను పంపించడమేమిటని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.


జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2గా బాధ్యతలు చేపట్టిన కె.నిరంజన్‌కుమార్

ఇప్పటికైనా మార్పు వచ్చేనా?:

ఏడాదికి రూ. 100 కోట్లకు పైగా ఆదాయం వచ్చే ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పనితీరు ఇప్పటికైనా మారుతుందా? అనే చర్చ జరుగుతోంది. అవినీతికి సహకరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న దస్తావేజు లేఖర్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దాడులు జరిగాక కూడా కార్యాలయంలో వారి హవా ఎంత మాత్రం తగ్గకపోవడం విశేషం.

గతంలో ఎన్నడూ లేనివిధంగా...

నగరంలో సూపర్‌బజార్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఘన చరిత్ర ఉంది. విశాఖనగరంలో తొలి రిజిస్ట్రార్ కార్యాలయమిదే. ఇక్కడ మిగతా కార్యాలయాకు భిన్నంగా ఇద్దరు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు ఉంటారు. ఆదాయ పరంగా మేటిగా ఉంటుంది. ఇంతటి చరిత్ర ఉన్న కార్యాలయంలో పనిచేస్తోన్న అందర్నీ ఒకేసారి బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో కూడా పలుసార్లు అనిశా దాడులు చేసినప్పటికీ ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో బదిలీలు జరగలేదని అధికారులు చెబుతున్నారు. బాధ్యులందరిపైనా శాఖాపరమైన విచారణ వీరిపై జరగనుంది. త్వరలోనే విచారణ అధికారిని నియమించనున్నారు.

షీలానగర్ ఉత్సవాల్లో మంత్రి గంటా

అక్కిరెడ్డిపాలెం : జాతీయ రహదారి పక్కన షీలానగర్ వద్ద నెలకొల్పిన భారీ గణనాథుడిని శుక్రవారం రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రతిష్ఠించారు. గణనాథుని ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం, రాజధాని నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని, రాష్ట్రం సుభిక్షింగా ఉండాలని వినాయకుణ్ని ప్రార్థించానన్నారు. పూజల్లో నిర్వాహకులు బి.త్రిమూర్తులు, కరణంరెడ్డి నర్సింగరావు, ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులనాయుడు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న మంత్రి గంటా

తప్పిన ఘోర ప్రమాదం

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి కూడలిలో శనివారం ఉదయం తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఒక యాసిడ్ ట్యాంకరు అదుపు తప్పి డివైడరును ఢీకొట్టింది. అయితే ఎటువంటి నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి యాసిడ్ లోడుతో విశాఖకు వస్తున్న ట్యాంకరు ఉదయం 7గంటల సమయంలో అగనంపూడి కూడలి వద్దకు రాగానే అదుపు తప్పి పక్కనే ఉన్న రహదారి విభాగినిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతినగా ఆయిల్ ట్యాంకుకు రంధ్రం ఏర్పడి అందులోని డీజిల్ రహదారిపై కారిపోయింది. అక్కడే ఉన్న హైమాస్ట్ దీపం కూడా కూలిపోయింది. దానికి అమర్చిన సీసీకెమెరాలు ధ్వంసమయ్యాయి. డ్రైవరు, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారంతో దువ్వాడ ట్రాఫిక్ ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


అగనంపూడి కూడలిలో అదుపు తప్పిన లారీ





అందరివాడికి ఆత్మీయ సత్కారం



విమానాశ్రయంలో వెంకయ్యనాయుడికి స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరి, సభాపతి కోడెల శివప్రసాదరావు

ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత శనివారం తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ముప్పవరపు వెంకయ్యనాయుడికి రాజధాని వాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఊరూవాడా ఏకమై.. చిన్నాపెద్దా కలిసి వచ్చి.. కరతాళధ్వనులతో ఆయన రాకను వేడుకగా నిర్వహించారు. దారి పొడవునా.. విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. చేతులలోని జాతీయ పతాకాలను ఊపుతూ జేజేలు పలికారు. వెంకయ్య అందరికీ అభివాదం చేస్తూ గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో కలసి ఓపెన్‌టాప్ వాహనంలో ముందుకు సాగారు.

– ఈనాడు, అమరావతి







గజమాలతో వెంకయ్యకు సత్కారం



గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబులతో ఉపరాష్ట్రపతి వెంకయ్య ముచ్చట్లు



సచివాలయం వద్ద జరిగిన సత్కార సభలో వెంకయ్యనాయుడుకి ఆశీర్వచనాలు అందిస్తున్న తితిదే వేదపండితులు



మోదీ మాస్క్‌తో అభిమాని





మార్గ పొడవునా విద్యార్థుల స్వాగత హేల



విమానాశ్రయం నుంచి ప్రదర్శనగా వెళుతున్న వెంకయ్య





గన్నవరం నుంచి విజయవాడ వరకు జాతీయపతాక రెపరెపలు



తప్పెట గుళ్ల కళాకారుల ఉత్సాహం

ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం..

ఉప రాష్ట్రపతి ర్యాలీ గన్నవారం విమానాశ్రయం నుంచి ప్రారంభమైంది. పాఠశాల విద్యార్థులు ఉదయం 8గంటలకే రహదారుల పైకి చేరుకున్నారు. క్రమ శిక్షణతో మెలిగి.. రహదారికి పక్కగా వరుసగా నిలబడ్డారు. విమానాశ్రయం వీఐపీ ద్వారం వద్ద నుంచి ప్రారంభించి.. స్వాగత ఏర్పాట్లు అట్టహాసంగా చేశారు. వందలాది కళాకారులు నృత్యాలు, విచిత్ర వేషధారణలు, విన్యాసాలు, ప్రదర్శనలతో ఉపరాష్ట్రపతిని ఆహ్వానించారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాకారులు పగటి వేషాలు, జానపద, గరగ నృత్యాలు, పులివేషాలు, గిరిజన కొమ్ము నృత్యాలు, తప్పెటగుళ్లు, డ్రాగన్లతో ప్రదర్శనలను దారి పొడుగునా ఏర్పాటు చేశారు. గ్రామీణ డప్పు వాయిద్య కళాకారులు, కోలాట కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రారంభంలో సెయింట్ జాన్స్ విద్యార్థులు తమ బ్యాండ్‌తో ఆకట్టుకున్నారు. బందరు రోడ్డులో సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు తమ బ్యాండ్‌తో అదరగొట్టారు. ఇలాగే దారిలో విద్యార్థులు ఎక్కడికక్కడ ఉత్సాహంగా స్వాగత వేడుకల్లో పాల్గొన్నారు.

దారి పొడవునా జేజేలు

గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రారంభమైన ర్యాలీ నెమ్మదిగా.. సాగుతూ ముందుకెళ్లింది. 23 కిలో మీటర్ల మేర విద్యార్థులు, ప్రజలు, నాయకులు ఉండడంతో అందరినీ పలకరిస్తూ.. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓపెన్‌టాప్ వాహనంలో ముందుకుసాగారు. దీంతో విమానాశ్రయం వద్ద ఉదయం 9.20 నిమిషాలకు ప్రారంభమైన ర్యాలీ.. విజయవాడ ప్రకాశం బ్యారేజీ సమీపంలో ఉన్న శనీశ్వరాలయం వద్దకు చేరుకునే సరికి రెండు గంటలకు పైగా సమయం పట్టింది. జాతీయ రహదారి మీదుగా సాగిన ర్యాలీ రామవరప్పాడు చౌరస్తా, ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం, రమేష్ ఆసుపత్రి మీదుగా బెంజిసర్కిల్‌కు చేరుకుంది. అక్కడి నుంచి బందరు రోడ్డులోనికి ప్రవేశించి.. ఇందిరాగాంధీ స్టేడియం, స్వరాజ్యమైదానం, పోలీస్ కంట్రోల్‌రూం ముందున్న పైవంతెన మీదుగా.. మున్సిపల్ కార్పొరేషన్ ముందునుంచి సాగింది. బెంజిసర్కిల్ వద్ద భారీగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కత్తి, కర్రసాముతో పాటూ అన్ని రకాల కళాకారులు తమ ప్రదర్శనలతో స్వాగతం పలికారు. మధ్యలో అక్కడక్కడా వాహనాన్ని ఆపి.. స్థానిక నాయకులు వెంకయ్యనాయుడిని సత్కరించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద తెదేపా, భాజపా నాయకులు స్వాగతం పలికారు. అక్కడితో.. ఓపెన్‌టాప్ స్వాగత ర్యాలీ ముగిసింది. అనంతరం వెలగపూడి సచివాలయం చేరుకున్న వెంకయ్యకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





ఆకట్టుకున్న గిరిజన నృత్యం



ప్రదర్శనలో ఆకర్షణగా నిలిచిన గిరిజన యువతులు



మత్స్యకారుల వేషధారణలో విద్యార్థులు



బేతాళ నృత్యాల సందడి



బ్యాండ్ బాజారే



తేజరిల్లిన రూపం...

రాజిల్లిన భక్తిపారవశ్యం...



తగరపువలసలో దివ్యమంగళ రూపుడిగా...


పత్రిలో నీవు... పండులో నీవు... తీపి లడ్డూలోనూ నీ రూపమే... ఓ గణేశా... లోకమంతా విస్తరించి.... భక్తజన హృదయ సామ్రాజ్యాన్ని ఏలడానికి ఏతెంచావా... అంటూ నగర ప్రజలు విఘ్నాధిపతికి ప్రణమిల్లారు. ఊరూవాడా చక్కని విగ్రహాలను ఏర్పాటుచేసి ఘనంగా పూజలు చేశారు. ఈ తొమ్మిది రోజులూ నీ నామ స్మరణలోనే మునిగితేలుతామంటూ అపర భక్తిని చాటారు.



గాంధీనగర్ యూత్ బాయ్స్ సంఘం ఆధ్వర్యంలో 11 ముఖాలు, 52చేతులు కల్గిన 10 అడుగుల ఎత్తయిన గణపయ్య విగ్రహాన్ని నెలకొల్పారు. ఇది విఘ్నేశ్వరుడి విశ్వరూపాన్ని చాటుతోంది.



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో సిద్ధిబుద్ధి సమేతుడిగా కొలువుదీరి..



సింధియాలోని ప్రకాశ్‌కాలనీలో 190 కేజీల లడ్డూలతో రూపుదిద్దుకున్న ఉండ్రాళ్లప్రియుడు



పచ్చని అలంకారంలో సంపత్ వినాయగర్

హరితశోభితుడై...



సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో గరికతో తీర్చిదిద్దిన గణపతి హరితశోభితుడిగా కొలువుదీరాడు. వైవిధ్యంగా ఉన్న ఈ రూపాన్ని చూసేందుకు భక్తులు బారులు తీరారు.



కలపాక దుర్గమాంబ కాలనీలో బొజ్జ వినాయకుడు



షీలానగర్‌లోని గణపతి మండపంలో ఏర్పాటుచేసిన అతి పెద్ద అగర్‌బత్తీని వెలిగిస్తున్న మంత్రి గంటా



చెంగల్రావుపేటలో ఏర్పాటుచేసిన బాహుబలి గణపతి



షీలానగర్‌లో రూపుదిద్దుకున్న మహా వినాయకుడు



మర్రిపాలెంలో కారు విడి భాగాలతో తయారు చేసిన వెంకట గణపతి



బుక్కావీధిలో ఉగ్ర నారసింహుడిగా...

నగరంలో అడ్డుగా ఉందని అధికారులు ఓ కబేళాను మూసేశారు. వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా మరోచోట ఆధునిక వసతులతో ఉన్నదాన్ని చూపించారు. వ్యాపారులేమో 'మేమంత దూరం వెళ్లలేమంటూ'.. అయిష్టత చూపారు. తమ వాదనలు వినిపిస్తూ కోర్టుకెళ్లారు. వ్యాపారులు కొత్త కబేళాకు వెళ్లడంలేదు.. అధికారులు పాత కబేళాకు రావడం లేదు.. కానీ మాంసం విక్రయాలు మాత్రం యథావిధిగా జరిగిపోతున్నాయి. అంటే ఈ మాంసం మంచిదని నిర్ధారిస్తూ అధికారులు వేసే 'ముద్ర' పడకుండానే బయటకు వచ్చేస్తుందన్నమాట.. మరి ప్రజల ఆరోగ్యం? గాల్లో దీపమే...

ప్రజారోగ్యం.. గాల్లో దీపం...



న్యూస్‌టుడే, ఆరిలోవ

నగరంలో మాంసం దుకాణానికి వెళ్తే.. మంచి మాంసమే కొంటున్నామని కొనుగోలుదారుల్లో ఎంతో కొంత ధీమా ఉంటుంది. సదరు మాంసం వ్యాపారి నగరంలోని మేకల కబేళా నుంచి మాంసాన్ని తీసుకువస్తే, అక్కడి వైద్యులు పరీక్ష చేసి, అది మంచి దేనని ధ్రువీకరించి ఉంటారు కాబట్టి. కాని కొద్ది రోజులుగా మహా నగరంలో కబేళా పనిచేయడం లేదు. హనుమంతువాక కూడలిలో ఉన్నదాన్ని మూసేశారు. పరదేశిపాలెం వద్దనున్న ఆధునిక కబేళాకు వ్యాపారులు వెళ్లడం లేదు.

హనుమంతువాక కబేళా మూసివేత

ఈనెల 9న జి.వి.ఎం.సి. అధికారులు కబేళాను పూర్తిగా మూసేశారు. ఇలా అయితే వ్యాపారులు తప్పనిసరిగా ఆధునిక కబేళాకు వెళ్తారని ఊహించారు. అయితే వ్యాపారులు మొండికేసి, సుమారు వారం రోజుల పాటు తమ దుకాణాలు కూడా మూసేసి బందు పాటించారు. కొందరు మాత్రం సొంతంగా మేకలను కొనుగోలు చేసి, ఇంటి వద్దే ప్రక్రియను పూర్తిచేసి దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ఇప్పుడు నగరంలో మాంసం వ్యాపారం మామూలుగానే జరుగుతోంది. ఒక్క ఆదివారం మన నగరంలో 13వేల కిలోలు మాంసం విక్రయాలు జరుగుతాయి. సాధారణ రోజుల్లో అంటే మంగళ, బుధ వారాల్లో అయితే సుమారు నాలుగు టన్నులు విక్రయాలు సాగుతాయి.

మేమెళ్లలేమంటున్న మాంసం వ్యాపారులు

ముప్పై ఏళ్ల క్రితం నగరం నడిబొడ్డున ఆశీలుమెట్టలోని ప్రస్తుత జోనల్ కార్యాలయం ఉన్న స్థలంలోనే కబేళా నిర్వహించేవారు. నగరం రోజు రోజుకూ విస్తరిస్తుండడంతో దీనిని అప్పటికి నగర శివారు ప్రాంతమైన హనుమంతువాక వద్దకు తరలించారు. ఇప్పుడు స్మార్ట్ సిటీ పేరిట నగరం శరవేగంగా విస్తరిస్తోంది. దీంతో పరదేశిపాలెం సమీపంలో ఆధునిక కబేళాను జి.వి.ఎం.సి. నిర్మించింది. అక్కడకు వెళ్లడానికి వ్యాపారులు నిరాకరించారు. తమ డిమాండ్లతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కబేళా ఇక్కడే ఉంచేలా ఆదేశాలివ్వాలన్నది వ్యాపారుల డిమాండ్. తమకు దూరాభారమవుతోందని, అంత దూరం వెళ్లలేమని పేర్కొంటున్నారు. అలాగే యంత్రాల ద్వారా తమకు కోత వద్దంటున్నారు.

ఏం జరుగుతోంది?

ప్రస్తుతం అనధికారికంగా మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. అధికారుల నిఘా అస్సల్లేదు. కోర్టులో కేసు ఉందంటూ ఈ వ్యాపారం వైపు కన్నెత్తి చూడ్డం లేదు. విక్రయిస్తున్న మాంసం మంచిదా కాదా, ఆయా మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా లేదా అన్న విషయం పరిశీలించే నాథుడు కరవు. న్యాయస్థానంలో ఉన్న కేసుకు, జరుగుతున్న వ్యవహారానికి సంబంధం లేకపోయినా దీనిని సాకుగా చూపించి, అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిఘా ఉన్నప్పుడే అనేక చోట్ల అక్రమాలు జరిగినట్లు దాఖలాలు ఉన్నాయి. మరి అధికారులు పట్టించుకోకపోతే ప్రజారోగ్యం ప్రశ్నార్థకం కాదా?


హనుమంతువాక కూడలిలో మూత పడిన మేకల కబేళా

దాడులు చేస్తాం

అనధికారికంగా వ్యాపారం చేసేవారిపై దాడులు చేస్తాం. దుకాణాలు మూయిస్తాం. కాస్త సున్నిత అంశం కావడం వల్ల కొద్దిగా వేచి చూసే ధోరణి అవలంబించాం. ఇకపై ఉపేక్షించేది లేదు. అనధికారికంగా పశువుల వధను, అనుమతిలేని మాంసం విక్రయాన్ని నిరోధిస్తాం.

– డాక్టర్ సుధాకర్, సహాయ డైరక్టర్, వెటర్నరీ విభాగం, జి.వి.ఎం.సి.


క్రాస్‌కంట్రీ ఛాంపియన్‌షిప్ ట్రోఫీతో విజేతలు

తీరగస్తీ దళానికి క్రాస్‌కంట్రీ ఛాంపియన్‌షిప్

సింధియా, న్యూస్‌టుడే: రాష్ట్ర తీరగస్తీదళం విశాఖ జిల్లా కేంద్రంగా ఈస్టర్న్ రీజియన్ క్రాస్‌కంట్రీ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం జరిగాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి తీరగస్తీదళ బృంద సభ్యులు పాల్గొన్నారు. మొత్తం 12 కిలోమీటర్ల దూరం సాగే పోటీలకు అయిదు టీములు పాల్గొన్నాయి. చెన్నైకు చెందిన మోనుకుమార్ ప్రథమ విజేతగా నిలిచి క్రాస్‌కంట్రీ ఛాంపియన్‌షిప్‌ని కైవసం చేసుకున్నారని ఐసీజీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి తీరగస్తీదళ నౌక 'సముద్ర పెహరేదార్' డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పికె మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకి ట్రోఫీని అందజేశారు.

రెవెన్యూ ఉద్యోగుల పాత్రపై పరిశీలన: కలెక్టర్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: భూ దస్త్రాల తారుమారు వ్యవహారంలో రెవెన్యూ ఉద్యోగుల పాత్రపై సునిశితంగా పరిశీలిస్తున్నామని కలెక్టర్‌ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆరోపణలు వచ్చిన వారికి షోకాజు నోటీసులు ఇస్తున్నామని, వారినుంచి వివరణలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలను తీసుకుంటామన్నారు. తాము తీసుకొనే చర్యలపై ఏటీఆర్‌లను సిట్‌కు అందజేస్తామన్నారు. రెవెన్యూ ఉద్యోగులు శాఖా పరమైన విచారణ చేయాలని కోరారని, తప్పుచేస్తే చర్యలను తీసుకోవాలని చెబుతున్నారని తెలిపారు. సిట్ నుంచి వచ్చిన సిఫార్సులపై చర్యలను తీసుకుంటున్నామన్నారు. మొత్తం ఫిర్యాదుల్లో 95 శాతం మేర సివిల్ కేసులకు సంబంధించినవేనని కలెక్టర్ వివరించారు.

పట్టాల అక్రమాలపై విచారణ: పట్టాల పంపిణీలో మామూళ్లు అడిగారని 30 మంది లబ్ధిదారులు చెప్పారని కలెక్టర్ తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నామన్నారు. 99 శాతం మంది పట్టాల పంపిణీ బాగా జరిగిందని చెప్పారన్నారు. వారం రోజుల్లో విచారణ పూర్తిచేసి అవినీతికి పాల్పడిన వారి నుంచి సొమ్ములు వెనక్కి ఇప్పిస్తామని, దీనిపై సీఎం కార్యాలయానికి నివేదిక అందిస్తామన్నారు.

శాస్త్రవేత్త డాక్టర్ మనోహర్‌కు బంగారుపతకం



ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖ అదనపు సహాయ సంచాలకుడిగా పదవీ విరమణ చేసిన చెరకు శాస్త్రవేత్త డాక్టర్ పీజే మనోహర్‌కు ప్రతిష్టాత్మకమైన 'ద నోయెల్ డేర్ గోల్డ్ మెడల్' వరించింది. 'ద షుగర్ టెక్నాలజీస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు వాహన ఇంధనంగా పెట్రోల్ స్థానంలో ఇథైల్ ఆల్కహాల్ వాడకంలో బ్రెజిల్ విజయం' అంశంపై ఆయన సమర్పించిన పరిశోధన పత్రాలనుగాను ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఉయ్యూరు, తణుకు, సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీల్లో పనిచేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వంలోని పలు అత్యున్నత పదవులను చేపట్టారు. చెరకు పరిశోధనలో మార్గనిర్దేశకత్వం వహించే 10 పరిశోధనాత్మక గ్రంథాలను ప్రచురించారు. డాక్టర్ మనోహర్ ప్రస్తుతం కిర్లంపూడి లేఅవుట్‌లో నివాసముంటున్నారు.

విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: సింహాద్రి ఎన్టీపీసీ రెండోయూనిట్‌లో శుక్రవారం తెల్లవారుజామున విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ యూనిట్‌లోని బాయిలర్ ట్యూబులకు లీకులు ఏర్పడడంతో బుధవారం తెల్లవారుజామున సంస్థ అధికారులు విద్యుదుత్పత్తిని నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. ఉద్యోగులు, కార్మికులు శ్రమించి బాయిలర్ ట్యూబులకు పడిన లీకులకు మరమ్మతులు పూర్తి చేసి ఉత్పత్తిని ప్రారంభించారు. ఇదిలా ఉంటే 500 మెగావాట్ల సామర్థ్యం గల మూడో యూనిట్‌లో వార్షిక మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం 1, 2, 4 యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది.

ప్రతిభ

జూనియర్ ఇంటర్ స్టడీప్లాన్

వృక్షశాస్త్రం

వృక్షశాస్త్రం పరిచయం అవసరం లేని శాస్త్రం. ప్రతి ఒక్కరూ జీవితంలో మొక్కల గురించి ఎంతో కొంత తెలుసుకునే ఉంటారు. వృక్షశాస్త్ర అధ్యయనం ద్వారా ప్రస్తుతం పర్యావరణంలో చోటుచేసుకుంటున్న కాలుష్యాన్ని నివారించేందుకు భావి తరాన్ని సంసిద్ధం చేయొచ్చు. మనం జీవించడానికి అతి ముఖ్యమైన ఆక్సిజన్‌ను అందించే మొక్కల పట్ల సహజమైన ఆసక్తి ఉన్న విద్యార్థులెవరైనా పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలరనడంలో సందేహం లేదు.

అవగాహనతోనే అనుకున్న మార్కులు...

ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూపు మొదటి సంవత్సరం విద్యార్థులు వృక్షశాస్త్ర అధ్యయనంలో కొన్ని మెలకువలు తెలుసుకుంటే వారు పబ్లిక్ పరీక్షలు, నీట్, ఎంసెట్‌కు తగిన విధంగా సంసిద్ధం కావచ్చు. అన్ని విజ్ఞాన శాస్త్ర విభాగాల్లాగే వృక్షశాస్త్ర అధ్యయనానికి కావాల్సిన ప్రాథమిక లక్షణాలు "పరిశీలన, విశ్లేషణ." సిలబస్‌లో చదువుకునే అనేక విషయాలను మన చుట్టూ ఉండే మొక్కల్లో పరిశీలించి విషయజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. బొమ్మలు గీసి, భాగాలను గుర్తించడం లాంటి నైపుణ్యాలను పెంపొందించుకుని, విషయ విశ్లేషణ చేసి పాఠ్యగ్రంథం (text book)ను పూర్తిగా అనుసరిస్తే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించవచ్చు. IPE - 2018 కి తయారయ్యే మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం కొన్ని సూచనలు...

★ మొదటగా బాటనీ (వృక్షశాస్త్రం) I సిలబస్‌ను పరిశీలిస్తే మొదటి సంవత్సర పాఠ్యపుస్తకంలో 7 యూనిట్‌లు, వీటిలో 13 అధ్యాయాలు (Chapters) ఉంటాయి. సిలబస్‌లోని అన్ని అధ్యాయాలు ముఖ్యమైనవే. అవగాహన కోసం పుస్తకంలోని ప్రతి వాక్యాన్ని చదివి, సొంతంగా నోట్సు రాసుకుంటే మంచిది. ఎన్నో రకాల స్టడీ మెటీరియల్స్, గైడ్స్ అందుబాటులో ఉన్నా పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా అవగాహన చేసుకుంటేనే విద్యార్థులు IPE, NEET, EAMCET లో అత్యధిక మార్కులు పొందగలుగుతారు.

IPE ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే ప్రశ్నల స్వరూపం, మార్కుల వెయిటేజీ కొంత వరకు తెలుసుకోవచ్చు. కింద ఇచ్చిన వెయిటేజ్ టేబుల్ గతంలో జరిగిన పరీక్షల్లోని ప్రశ్నపత్రాల ఆధారంగా రూపొందించింది. ప్రశ్నపత్రంలో పేపర్ సెట్టర్‌లు మార్పులు చేసే వీలుంటుంది/ లేదా ప్రశ్నల వెయిటేజీలో మార్పులు చేసి ఇవ్వొచ్చు. ఇది కేవలం విద్యార్థుల అవగాహన కోసం మాత్రమే.

యూనిట్	అధ్యాయాలు (Chapters)	2 M	4 M	8 M	మొత్తం
I	1-4	3(6)	2(8)	-	14
II	5	2(4)	-	1(8)	12
III	6,7	-	1(4)	1(8)	12
IV	8	1(2)	1(4)	-	06
V	9, 10, 11	3(6)	2(8)	-	14
VI	12	-	1(4)	1(8)	12
VII	13	1(2)	1(4)	-	06
					76

యూనిట్ - I

ఇందులో జీవప్రపంచంలో వైవిధ్యం అనే యూనిట్‌కు సంబంధించి నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయాల్లో జీవశాస్త్రంలోని మౌలిక అంశాలు, జీవుల వైవిధ్యం, విట్టేకర్ అయిదు రాజ్యాల వర్గీకరణ, వృక్షశాస్త్ర ఆవశ్యకత, పరిధి, వృక్షశాస్త్ర విభాగాలు మొదలైన అంశాలను చర్చించారు. లైకెన్‌ల లాంటి ప్రత్యేకమైన జీవుల గురించి, వైరస్‌లు, బ్యాక్టీరియా, సయనో బ్యాక్టీరియా, మైకోప్లాస్మాలు, విరాయిడ్‌లు లాంటి జీవుల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటారు. వృక్షరాజ్యంలోని శైవలాలు, బ్రయోఫైట్లు, టెరిడోఫైట్లు, వివృతబీజాలు, ఆవృత బీజాలు లాంటి మొక్కల లక్షణాలు, పోలికలు, తేడాలు తెలుసుకుంటారు.

★ **పరీక్షల కోసం:** ఈ అధ్యాయాల్లో సుమారు 48 అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు ఉన్నాయి. వీటన్నింటిని తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ఈ విభాగం నుంచి కనీసం మూడు 2 మార్కుల (అతి స్వల్ప సమాధాన తరహావి) ప్రశ్నలు వచ్చే వీలుంటుంది. కాబట్టి వీటిని నాలుగు/ అయిదు అసైన్‌మెంట్లుగా విభజించుకుని నేర్చుకోవచ్చు. అదే విధంగా ఈ విభాగంలో కనీసం 2 స్వల్ప సమాధాన ప్రశ్నలు (స్వల్ప సమాధాన తరహా) పరీక్ష పత్రంలో కనిపించే అవకాశముంది. వర్గీకరణ సహాయకాలు, ద్వినామ నామీకరణం, యూగ్లినాయిడ్‌లు, క్రైసోఫైట్లు, డైనోఫ్లాజల్లేట్‌ల లక్షణాలు, శైవలాలు, బ్రయోఫైట్లు, శిలీంధ్రాల ఆర్థిక ప్రాముఖ్యత, ఎరుపు/ గోధుమ శైవలాల మధ్య తేడాలు, లివర్‌వర్ట్‌లు/ మాస్‌లు, ఏకదళ బీజాలు/ ద్విదళ బీజాల మధ్య తేడాలు, వ్యవసాయ, ఉద్యాన, ఔషధ రంగాల్లో వృక్షశాస్త్ర పరిధి లాంటి అంశాలకు సంబంధించిన ప్రశ్నలు బాగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

యూనిట్ - II

అధ్యాయం- 5 పుష్పించే మొక్కల స్వరూపశాస్త్రం. దీనిలో ప్రధానంగా కాండం, వేరు, పత్రాలు లాంటి శాఖీయ భాగాలు, పుష్పం, ఫలం లాంటి ప్రత్యుత్పత్తి భాగాల స్వరూపం, రూపాంతరాలు, పుష్పవిన్యాస రకాలకు సంబంధించిన వర్ణన ఉంటుంది. ప్రయోగాలపరంగా ఈ అధ్యాయం చాలా ముఖ్యమైంది, ఆసక్తికరమైంది. పుస్తకంలోని అనేక ఉదాహరణలు మనం ప్రత్యక్షంగా చూసే వీలుంటుంది. ప్రయోగశాలలోని స్పెసిమెన్‌లను పరిశీలించి, వీటి లక్షణాలను బాగా అధ్యయనం చేయొచ్చు.

★ ముఖ్యంగా వేరు రూపాంతరాలు, కాండ రూపాంతరాలు, అనిశ్చిత పుష్ప విన్యాసం రకాలు లాంటి 8 మార్కుల ప్రశ్నలు (దీర్ఘ సమాధాన ప్రశ్నలు) తప్పనిసరిగా నేర్చుకోవాలి. వీటికి సంబంధించి పటాలను గీసి, భాగాలను గుర్తించాలి. వీటికి కనీసం 3 మార్కులు కేటాయిస్తారు (జవాబు రాసినందుకు 5 మార్కులు). ఈ అధ్యాయంలోని 24 రెండు మార్కుల ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకున్నట్లయితే పరీక్షలో కనీసం రెండు ప్రశ్నలు రాయగలుగుతారు. మొత్తానికి ఈ విభాగం నుంచి తప్పనిసరిగా 8 మార్కుల ప్రశ్నలు, 2 మార్కుల ప్రశ్నలు అధ్యయనం చేయాలి. పటాలు గీసే నైపుణ్యం రికార్డు వర్క్‌కు కూడా ఉపయోగపడుతుంది.

యూనిట్ - III

6, 7 అధ్యాయాల్లో మొక్కల్లో వివిధ రకాల ప్రత్యుత్పత్తి విధానాలు, పుష్పించే మొక్కల్లో లైంగిక ప్రత్యుత్పత్తికి సంబంధించిన పరాగ సంపర్కం, ఫలదీకరణం, పిండకోశ నిర్మాణం లాంటి అంశాలు ఉంటాయి. ఈ విభాగంలో 4, 8 మార్కుల ప్రశ్నలు ప్రధానమైనవి.

★ అలైంగిక, లైంగిక ప్రత్యుత్పత్తుల మధ్య తేడాలు, ఫలదీకరణం తర్వాత మార్పులు, అండంలోకి పరాగనాళం ప్రవేశించే పద్ధతులు, బ్యాగింగ్, విపుంసీకరణ, త్రిసంయోగం లాంటి అంశాలపై 4 మార్కుల ప్రశ్నలు, పుష్పంలోని ఫలదీకరణానంతర మార్పులు, పిండకోశం పటం వర్ణన, సూక్ష్మసిద్ధ బీజాశయం, ఫలదీకరణ విధానం లాంటి 8 మార్కుల ప్రశ్నలు ముఖ్యమైనవి.

యూనిట్ - IV

అధ్యాయం 8 లో మొక్కల సిస్టమాటిక్స్ - ఆవృత బీజాల వర్గీకరణ గురించి వివరించారు. మొక్క స్వరూపాన్ని సాంకేతిక వర్ణన ద్వారా శాఖీయ, పుష్ప లక్షణాలను అవగాహన చేసుకోవచ్చు. అయిదో అధ్యాయంలోని అన్ని అంశాలు ఈ అధ్యాయంలో ఉపయోగపడతాయి. ఫాబేసి, సొలనేసి, లిలియేసి కుటుంబాలకు చెందిన ముఖ్యమైన మొక్కలు, వాటి శాఖీయ, పుష్ప లక్షణాలు, ఆర్థిక ప్రాముఖ్యత ఇందులోని ముఖ్యమైన అంశాలు. ఈ అధ్యాయంలో ప్రశ్నలు తక్కువ. సులభంగా మార్కులు సంపాదించే వీలుంటుంది. 2, 4 మార్కుల ప్రశ్నలు తప్పనిసరిగా చదివితే పరీక్షలో 6 మార్కులు కచ్చితంగా సాధించవచ్చు.

యూనిట్ - V

కణ నిర్మాణం, విధుల్లోని 9, 10, 11 అధ్యాయాల్లో కణ నిర్మాణం, కణాంగాలు, విధులు, జీవాణువులు, కణచక్రం, సమ విభజన, క్షయకరణ విభజన అంశాలు ఉన్నాయి. 3 అధ్యాయాల్లో కలిపి 2 మార్కుల ప్రశ్నలు 39 ఉంటాయి. వీటన్నింటిని నేర్చుకోగలిగితే ఈ విభాగం నుంచి వచ్చే మూడు 2 మార్కుల ప్రశ్నలకు సులభంగా సమాధానాలు రాయొచ్చు.

★ ఈ విభాగం నుంచి కనీసం 2 నాలుగు మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. హరిత రేణువు, మైటోకాండ్రియా నిర్మాణం, కేంద్రకం, కణ సిద్ధాంతం, క్రోమోసోమ్ రకాలు, కేంద్రక పూర్వకణం లక్షణాలు, కేంద్రకామ్లం, ప్రోటీన్ నిర్మాణం, అంతర్దశ, క్షయకరణ విభజనలోని ప్రథమ దశ-I లోని అంశాలు 4 మార్కుల ప్రశ్నలుగా ఇస్తారు.

యూనిట్ - VI

మొక్కల అంతర్నిర్మాణం సంవిధానంలోని అధ్యాయం 12 లో కణజాలశాస్త్రం, అంతర్నిర్మాణ శాస్త్రం గురించి తెలుసుకుంటారు. వృక్ష కణజాలాలు, రకాలు, సరళ, సంక్లిష్ట కణజాలాలు, వాటి విధులు, కాండం, వేరు, పత్రం అంతర్నిర్మాణం లాంటి అంశాలు ముఖ్యమైనవి. ఈ విభాగంలో ప్రయోగ పూర్వకంగా ద్విదళబీజ, ఏకదళబీజ వేరు, కాండాలను అడ్డుకోత తీసి సూక్ష్మదర్శిని ద్వారా పరిశీలిస్తారు. వీటి పటాలు గీసి, భాగాలను గుర్తించడం చాలా ముఖ్యం.

★ ఈ విభాగం నుంచి తప్పనిసరిగా ఒక 8 మార్కుల ప్రశ్న రావచ్చు. కాబట్టి సరైన వాల్యూ పాయింట్‌లను నేర్చుకుని, పటాలు గీయడం బాగా సాధన చేయాలి. అదే విధంగా నాలుగు మార్కుల ప్రశ్నలకు సంబంధించి వివిధ రకాల విభాజ్య కణజాలాలు, పరిచర్మం, వాయురంధ్రాలు, పత్రరంధ్రాల మధ్య భేదాలు, బెండు విభాజ్య కణజాలం, వార్షిక వలయాలు లాంటి అంశాలు చదవాలి.

యూనిట్ - VII

అధ్యాయం - 13 లో ఆవరణ శాస్త్రంలోని మౌలిక అంశాలను చేర్చారు. ఆవరణ సంబంధ అనుకూలనాలు, మొక్కల అనుక్రమం, ఆవరణ సంబంధ సేవల గురించి నేర్చుకుంటారు. ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన భౌగోళిక అంశాలు ఇందులో ఉన్నాయి. పరీక్షల పరంగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు ముఖ్యమైనవి. 4 మార్కుల ప్రశ్నలకు సంబంధించి నీటి మొక్కల రకాలు, ఎడారి మొక్కల రకాలు, నీటి మొక్కల ఆవరణ సంబంధ అనుకూలనాలు, ఎడారి మొక్కల ఆవరణ సంబంధ అనుకూలనాలు, ఆవరణ సంబంధ సేవలు లాంటివి ముఖ్యమైనవి.

★ విద్యార్థులు తగిన విధంగా ప్రణాళికాబద్ధంగా సిలబస్‌ను ముందుగానే విభజించుకుని థియరీ పరీక్షలకు, అదే విధంగా రెండో సంవత్సరంలో జరిగే ప్రయోగ పరీక్షలకు ఇప్పటినుంచే తయారు కావాలి. ముందు జరిగిన పరీక్ష పత్రాలను పరిశీలించి వెయిటేజీని దృష్టిలో ఉంచుకుని, ప్రయత్నించినట్లయితే ప్రతి ఒక్కరూ కచ్చితంగా 60/60 మార్కులు సాధించవచ్చు.

ఇవి గుర్తుంచుకోండి..

★ ప్రతి పాఠ్యాంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని చదవాలి.

★ కీ పాయింట్‌లను తయారు చేసుకోవాలి.

★ రెండు మార్కుల ప్రశ్నలకు వీలైనంత క్లుప్తంగా, కచ్చితమైన సమాధానాలు తయారు చేసుకోవాలి.

★ రెండు మార్కుల ప్రశ్నలకు ఛాయిస్ ఉండదు కాబట్టి పూర్తి మార్కులు సాధించాలంటే అన్ని ప్రశ్నలు చదవాలి.

★ నాలుగు మార్కుల ప్రశ్నలకు (స్వల్ప సమాధాన తరహా) వాల్యూ పాయింట్‌లు కనీసం ఎనిమిది రాసుకుని, నేర్చుకోవాలి. అవసరమైన ప్రశ్నలకు పటాలు గీసి, భాగాలు గుర్తించాలి.

★ ఎనిమిది మార్కుల ప్రశ్నలకు (దీర్ఘసమాధాన ప్రశ్నలు) జవాబు రాసేటప్పుడు పూర్తిగా వివరణలు, నిర్వచనాలు, ఉదాహరణలు, విధానాలు రాయాల్సి ఉంటుంది. పటాలు గీసి, భాగాలు గుర్తించడానికి కనీసం 3 మార్కులు కేటాయించారని గుర్తుంచుకోండి.



రచయిత
డాక్టర్ పి. ఉమాఅమరేశ్వరి
సీనియర్ లెక్చరర్

మాదిరి ప్రశ్నపత్రం

సమయం: 3 గంటలు మార్కులు: 60

విభాగం - I

★ అతి స్వల్ప సమాధాన తరహా ప్రశ్నలు.
★ అన్ని ప్రశ్నలు వరుస క్రమంలో ఒకేచోట రాయాలి.
★ ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు.

$2 \times 10 = 20$ M

1. 'బాటనీ' అనే పదం ఏ విధంగా వాడుకలోకి వచ్చిందో వివరించండి.
2. గోధుమ వర్ణ, ఎరుపు వర్ణ శైవలాల్లో ఆ రంగులకు కారణమైన పదార్థాల పేర్లు తెలపండి.
3. వర్గీకరణలో మౌలిక ప్రమాణం ఏది? దాన్ని నిర్వచించండి.
4. మధ్యాభిసార, నిశ్చిత పుష్ప విన్యాసాల మధ్య ఉన్న భేదాన్ని తెలపండి.
5. మకుటదళోపరిస్థితం అంటే ఏమిటి? ఒక ఉదాహరణ ఇవ్వండి.
6. ఒమేగా వర్గీకరణ శాస్త్రం అంటే ఏమిటి?
7. మోటాసెంట్రిక్ క్రోమోసోమ్ లక్షణం ఏమిటి?
8. ప్రాథమిక, ద్వితీయ జీవక్రియోత్పన్నాలు అంటే ఏమిటి? ఉదాహరణలు ఇవ్వండి.
9. ఒక కణజాలంలో 1024 కణాలు ఉంటే ప్రథమ జనక కణం ఎన్నిసార్లు సమవిభజన చెంది ఉంటుంది?
10. జనాభా, సముదాయాలను నిర్వచించండి.

విభాగం-II

★ స్వల్ప సమాధాన తరహా ప్రశ్నలు.
★ ఏవైనా ఆరు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

$6 \times 4 = 24$ M

11. మన దైనందిన జీవితంలో శిలీంధ్రాల పాత్ర గురించి రాయండి.
12. వృక్ష శరీరధర్మశాస్త్రాన్ని ఉదాహరణగా తీసుకుని వృక్ష శాస్త్ర పరిధిని వివరించండి.
13. అలైంగిక, లైంగిక ప్రత్యుత్పత్తుల మధ్య తేడాలను గుర్తించండి. శాఖీయ ప్రత్యుత్పత్తిని కూడా ఒక రకమైన అలైంగిక ప్రత్యుత్పత్తి రకంగా ఎందుకు పరిగణిస్తారు?
14. ఫాబేసికి చెందిన మొక్కల ఆర్థిక ప్రాముఖ్యతను తెలపండి.
15. కణ శక్త్యాగారాల నిర్మాణం, విధులను వివరించండి.
16. క్షయకరణ విభజనలోని ముఖ్యాంశాలను తెలపండి.
17. వాయు రంధ్రాలు, పత్ర రంధ్రాల మధ్య ఉండే భేదాలు ఏమిటి?
18. ఆవరణ-సంబంధ విధులను కొనసాగించడం కోసం తీసుకోవాల్సిన చర్యలను గురించి రాయండి.

విభాగం -III

★ దీర్ఘ సమాధాన తరహా ప్రశ్నలు.
★ ఏవైనా రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

$8 \times 2 = 16$ M

19. వేరు రూపాంతరాన్ని నిర్వచించండి. వివిధ విధులను నిర్వర్తించడానికి వేరు ఏ విధంగా రూపాంతరం చెందిందో వివరించండి.
20. ఆవృత బీజ మొక్కల్లో జరిగే ఫలదీకరణ విధానాన్ని వివరించండి.
21. ద్విదళ బీజ కాండం అడ్డుకోతను వివరించండి.

Kantipudi Kameswara Rao

Q: Respected sir, how many kinds of subscriptions are there in English letter writing?

A: i) Yours faithfully, when you write to higher authorities or superiors.

ii) Yours sincerely, when you write to your friends, people who you don't know and you are writing for the first time.

iii) Yours obediently, when you write to your teachers, head master, principal, etc.,

iv) Yours truly, when you are writing to strangers,

v) Yours affectionately/ yours lovingly when you are writing to the members of your family, and

vi) Yours ever, when you are writing to your wife/ the girl you love. Nowadays, however, in email correspondence, no subscriptions are used.

Ch. Satyanarayana

Q: Respected sir, could you please tell us the difference in use of the following words. Contain, Comprise, Consist.

A: Contain = have something within something else.

Eg: The purse contains her money = the purse has her money in it.

★ Comprise = consist of (to be made of or formed of something).

Eg: The book comprises twenty chapters = It consists of twenty chapters = the number of chapters included in the book are twenty.

N. Bhaktavatsalam, Nellore

Q: నిన్న సాయంత్రం రోడ్డు మీద నడుస్తుంటే, రాయి తగిలి, బోర్లా పడ్డాను - ఈ వాక్యాన్ని ఇంగ్లిష్‌లోకి అనువదించగలరు.

A: As I was walking down the road, I slipped over a stone, and fell face downwards.

ప్రతిభ SPOKEN ENGLISH 955

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...

స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్‌పూర్, రంగారెడ్డి జిల్లా.

Email your questions to: pratibhadesk@eenadu.net

Award, Reward మధ్య తేడా..?



K. Saraswathi

Q: Sir, let me know the meanings of the following with examples.

1) Probe 2) Stake 3) Stand off
4) Crack down 5) Sworn in
6) Swearing in
7) Inauguration, commencement
8) Nipped in the buds.

A: 1) Probe = search / examine something carefully.

Eg: The CBI is probing into the corruption charges against the official.

2) Stake: Three meanings; a) A share in business. **Eg:** He holds a 30% stake in the business.

b) Costs / risks involved.

Eg: Competition has raised the stakes in Global business.

c) Bet. **Eg:** Dharmaraja staked Drowpadi in the game of dice. (he offered her as a bet).

3) Stand off: a) A competition in which neither side wins.

Eg: There was a stand off between the two teams (the game was a draw).

b) A situation in which somebody threatens an official and prevents them from acting.

4) Crack down: To take strong action to stop something bad from happening.

Eg: The tax officials and police cracked down on people with black money.

5) Sworn in: Someone elected promising to people they would discharge their duties to the best of their best to serve people. **Eg:** The high court judge sworn in the governor.

6) Swearing in = Promising to people that they would discharge their duties. (swear = promise)

7) Inauguration = A formal beginning / formal induction of somebody into office.

Commencement = Beginning. **Eg:** The commencement of the match took place at 9 AM. However, beginning is simpler than commencement.

8) Nip something in the bud (not, nipped in the buds) = stop something at an early stage, without allowing it to become a big problem. **Eg:** They should have nipped in the bud the agitation for a separate state.

Mahesh, Uravakonda

Q: సర్, కింది వాక్యాల మధ్య తేడాను తెలుగులో వివరించగలరు.

1) He was punished
2) He was to be punished.
3) He is liable to be punished.

A: 1) అతడిని శిక్షించారు.
2) అతడికి శిక్ష పడాల్సి ఉండింది.
3) అతడికి శిక్ష తప్పకుండా పడుతుంది.

Q: Sir, please translate the following into Telugu.

1) A man who wanted to be a patriot.
2) You have to develop proper instructions to be given to it.
3) They are to be get the same place.
4) Two chlorine atoms has to be an s-p bond.
5) To be or not to be is the problem.
6) Do you like to be let alone?



7) Cause to be done.
8) Right to be elected and hold office.
9) If the United Nations is to be a universal organisation in the true sense.
10) Who are accepted to be a legal personality.
11) The proposition seems to be unfeasible.

A: 1) దేశభక్తుడు కావాలనుకున్నతను.



Writer

- M. Suresan

2) నువ్వు తగిన సూచనలు పెంపొందించుకోవాలి, దానికి ఇవ్వడానికి - ఈ వాక్యానికి అర్థం లేదు.
3) వాళ్లకు అదే స్థానం రావాలి.
4) రెండు క్లోరిన్ అణువులు s - p బంధంలో ఉండాలి.
5) ఉండటమా, పోవడమా (చనిపోవడమా) అనేదే సమస్య.
6) నిన్ను ఒంటరిగా వదిలేయడం నీకు ఇష్టమా?
7) చేయించడం
8) ఎన్నికవడానికి, ఒక పదవిని స్వీకరించేందుకు హక్కు.
9) ఐక్య రాజ్య సంస్థ నిజంగా విశ్వ సంస్థగా ఉండాలంటే.
10) ఎవరినైతే చట్ట సమ్మతమైన వ్యక్తిగా అంగీకరిస్తారో.
11) ఈ ప్రతిపాదన ఆమోదయోగ్యం కానిదిగా కనిపిస్తుంది.

Rafi

Q: Sir, I am a teacher in school. i) Could you please tell me the difference between the spoken English, functional English and Communicative English and also the difference between ii) ..... he went off, ... away, and just .... he went.

A: i) Spoken English means, English as it is spoken. It is colloquial. Communicative English is English used for communication, both spoken and written. Functional English means English used for certain functions, like wishing people when you first meet them, opening conversation with familiar and unfamiliar people, asking for the way to a certain place, requesting people to help you etc.

ii) He went off = He went away. 'He went' is not proper English unless it is followed by the place which he went to.

J. Satyanarayana

Q: Respected sir, please tell me the meaning of below mentioned sentence in Telugu.

'no one is indispensable'

A: ఎవరూ అంత అత్యవసరం కాదు./ ఎవరు లేకపోయినా పని జరిగిపోతుంది.

B. Devendra

Q: Sir what is the difference between Award and Reward ?

A: Award = Something given to a person in recognition of their services. Padmasree, Padmabhushan, etc., are awards. Rewards are things given to people for their particular achievements.

Vasa Mahesh, Visakhapatnam

Q: Good morning sir, can I use the "Idioms and phrases" in essay writing topics like IELTS or TOEFL exams?

A: Why not? While writing essays in exams like IELTS and TOEFL, you get even more marks for your idiomatic English than for your plain English. Go ahead, and learn as many idioms and phrases as you can and use them in TOEFL and IELTS.

Prince Revanth

Q: Sir, could you please tell me the meanings of following:

1) Subjection 2) Arbitrary

A: 1) 'Subjection' is the ruling of one country by a single person, or by another country. Eg: India was under the subjection of the British Rule till 1947. India was under the subjection of the Moghul rule till the 17th century.

2) Depending on a person's will or choice without any reason or logic. A king rules his country arbitrarily (that is, without any reason, logic, system, etc.) ఇష్టం వచ్చినట్లు.

Divvela Surya Teja

Q: Sir, please translate the following word into English. నీకెందుకు?

A: How are you concerned? / Is that any of your business? / What have you got to do with it?

'స్పోకెన్ ఇంగ్లిష్' పాత సంచికల కోసం చూడండి..

www.eenadupratibha.net

Y. Alekhya



Q: Sir, let me know the difference between 'when', while'. And in which contexts we can use the word towards?

A: When and while are almost the same. However, when is mostly used with simple tenses, while is used with continuous tenses.

Examples: 1) When he returned home, he found his dog missing.

2) While her sister was singing, she was dancing.

Sharanya. K

Q: Sir, please translate the following sentence. "It looks nice, isn't it?"

What is the meaning of isn't it? when we use this? Please explain.

A: 'It looks nice, isn't it'? - here the question tag is wrong. The correct question tag is, 'It looks nice, doesn't it?' Question tags like 'isn't it', 'doesn't it' etc., in Telugu mean, ఔనా, కాదా, కదా, లేదా.

హాయ్! బుజ్జీ!!

మలేషియా

మలేషియా... మనకు తెలిసిన పేరే... మరి తెలియని ఈ దేశ కబుర్లేంటో తెలుసుకుందామా!



❖ ఆసియా ఖండంలోని ముఖ్య దేశాల్లో మలేషియా ఒకటి.

❖ పూర్వం డచ్, బ్రిటిషర్ల పాలనలో ఉన్న ఇది 1957లో పూర్తి స్వాతంత్ర్యం పొందింది.

❖ ఇక్కడి జాతీయ రహదారుల పొడవు 65,877 కిలోమీటర్లు. అంటే మొత్తం భూమి చుట్టుకొలత కంటే కూడా ఎక్కువ. (భూమి చుట్టుకొలత 40,075 కిలోమీటర్లు మాత్రమే)

❖ మలేషియా అనగానే జంట టవర్లే గుర్తొస్తాయి. వీటి పేరు 'పెట్రోనాస్ ట్విన్ టవర్లు'. ఒక్కోదాంట్లో 88 అంతస్తులుంటాయి. వీటి ఎత్తు 450 మీటర్లు. అంటే ఈఫిల్ టవర్ కంటే ఎత్తయినవే అన్నమాట. వీటిలో కార్యాలయాలుంటాయి.

❖ రబ్బరు ఉత్పత్తి చేయడంలో ప్రపంచంలో మూడో అతి పెద్ద దేశమిది. 2011 సంవత్సరంలోనే 9,96,673 మెట్రిక్ టన్నుల రబ్బరును ఉత్పత్తి చేసింది. ప్రపంచంలోనే రబ్బరు చేతి తొడుగులు తయారు చేయడంలో ప్రసిద్ధి చెందిందీ దేశం.

❖ ప్రపంచంలోనే అతి పెద్ద కార్తికేయుడి (సుబ్రహ్మణ్యేశ్వరస్వామి) విగ్రహం ఉన్నది ఇక్కడి బాటు గుహల్లోని ఆలయం దగ్గరే. దీని ఎత్తు 140 అడుగులు. అంటే ఓ పద్నాలుగు అంతస్తుల భవనమంత.

❖ అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే ఇక్కడ దుస్తులు, ఆహారం, నివాస వసతుల కోసం అయ్యే ఖర్చు తక్కువే.

❖ వీరి ఆహార అలవాట్లు మనకులాగే ఉంటాయి. మధ్యాహ్న భోజనంలో గుడ్డు, కొబ్బరన్నం, కారంగా ఉండే సంబల్ చిల్లీ పేస్ట్, వేరుసెనగ గింజలు, దోసకాయ ముక్కలు... లాంటివి ఉంటాయి.

ఆధునిక మానవుడి అడుగుజాడలు ఇక్కడే!





విదేశం... విశేషం!

దేశం: మలేషియా
రాజధాని: కౌలాలంపూర్
కరెన్సీ: మలేషియన్ రింగెట్
జనాభా: 3,15,48,000 **విస్తీర్ణం:** 3,30,803 చదరపు కిలోమీటర్లు
అధికారిక భాష: బహాసా మలేషియా **అధికారిక లిపి:** మలయ్

జెండా: జెండాపై ఉన్న ఎరుపు, తెలుపు రంగు గీతలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమాన హోదాకూ, నక్షత్రం వారి ఐకమత్యానికీ నిదర్శనం. పక్కనున్న అర్ధ చంద్రుడు వారి అధికారిక మతం ఇస్లాంకు ప్రతీక.



❖ మలేషియాలో 40,000 సంవత్సరాలకు ముందు ఆధునిక మానవుడు నివసించినట్టు ఆధారాలు దొరికాయి. క్రీస్తుశకం మొదటి శతాబ్దం నుంచి ఇక్కడికి భారత్, చైనా నుంచి వ్యాపారులు వలసవచ్చారట. రెండో, మూడో శతాబ్దాల్లో వాణిజ్య రేవులు, తీర ప్రాంత నగరాలు నిర్మించుకున్నారు. దీంతో ఈ దేశ ప్రజలపై భారతీయ, చైనా సంస్కృతులు, సంప్రదాయాల ప్రభావం పడటం మొదలైంది.

❖ ప్రపంచంలోనే పొడవైన(కేవ్ ఛాంబర్) గుహ గది ఉన్నది ఇక్కడి సర్వాక్ ఛాంబర్ గుహల్లోనే. ❖ ఈ దేశ కరెన్సీ రింగెట్. స్థానికులు మాత్రం డాలర్ అనే పిలుచుకుంటారు. దీని విలువ ఇప్పుడు మన కరెన్సీలో దాదాపు 14 నుంచి 15 రూపాయలుంది.



❖ వీధి గోడలపై బొమ్మలేసే కళకు ఇక్కడ చాలా ఆదరణ ఉంది. అందుకే ఇక్కడి వీధుల్లో ఎక్కడ చూసినా, ముఖ్యంగా కౌలా లంపూర్‌లో గోడలపై చాలా బొమ్మలు కనిపిస్తుంటాయి.

❖ మనిషికి దగ్గర పోలికలతో ఉండే తోకలేని కోతులు 'ఒరాంగుటాన్లు' తెలుసుగా. ప్రస్తుతం ఇవి ఈ దేశ సమీపంలోని బోర్నియో, సుమాత్ర దీవుల్లో మాత్రమే ఉన్నాయి.

❖ ప్రపంచంలోనే విడిపోకుండా ఉన్న అతి పెద్ద ఆకు ఇక్కడి సాభాలో ఉంది. అది అలోకాసియా మక్రోరైజ మొక్కది. 3.2 మీటర్ల పొడవు, 1.92 మీటర్ల వెడల్పు ఉంటుంది.

❖ ఇక్కడున్న వలసదారుల్లో చైనీయులు, భారతీయులే ఎక్కువ.

❖ ఇప్పుడు స్వతంత్రంగా ఉన్న సింగపూర్ దేశం గతంలో మలేషియాలోని ఒక రాష్ట్రం.

ఎందుకు? ఏమిటి? ఎలా?

సముద్రంలోని అగ్నిపర్వతాలు చల్లారిపోవే?

ప్రశ్న: సముద్రాల్లో ఉండే అగ్ని పర్వతాల చుట్టూ నీరు ఉంది కాబట్టి ఆ పర్వతాలు చల్లారిపోవాలి. కానీ అవి అగ్ని చిమ్ముతూ ఉంటాయెందుకని?

- **బి. రాజేశ్వర్,** పొన్కల్

జవాబు: సముద్రాల అడుగునున్న చాలా అగ్ని పర్వతాలు లావా వెదజల్లకుండా వెంటనే చల్లారి పోతుంటాయి. కానీ తీవ్రమైన ఒత్తిడితో సముద్రపు లోతు భాగాన ఉన్న నేల పొరకన్నా, ఇంకా అట్టడుగు పొరల్లోంచి మాగ్మా చిమ్ముకొస్తుంటుంది. ఇది చాలా ఒత్తిడితో బయటకు రావడం వల్ల సముద్రపు నీటితో చల్లారదు. దీంతో అగ్ని కీలల్లాగ అప్పుడప్పుడు లావాని చిమ్ముతాయి. అయితే ఇలా లావా చిమ్మడం అదే పనిగా, ఒకేలా ఉండదు.

సముద్రపు అడుగు భాగాల్లో అగ్ని పర్వతాలు ఉన్నట్లయితే వాటి నుంచి చిమ్మే లావా అడుగునే చల్లారిపోయినా ఆ లావాలో ఉండే వాయువులు బుగ్గల్లా, బుడగల్లా సముద్రపు మట్టానికి చేరుకుంటాయి. ఆ వాయువుల విషతత్వం, వేడి వల్ల అక్కడ సముద్ర జీవులు బతకలేవు. అందుకే సముద్రపు నీటి ఉపరితలం నుంచి వేడి వాయువులు వస్తున్నా, అక్కడి నీటి రంగు మరోలా ఉన్నా అడుగున అగ్ని పర్వతాలున్నట్లు భావించొచ్చు.

- **ప్రొ॥ ఎ. రామచంద్రయ్య,** నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక (తెలంగాణ)



మన శక్తి కన్నా చాలా సార్లు సహనం మంచి ఫలితాల్ని ఇస్తుంది
- ఎమర్సన్

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Qualification = యోగ్యత
- నమూనా = మాదిరి

నవ్వుల జల్లులు!

టీచర్: రెండు లీటర్ల పాలకు రెండు లీటర్ల నీళ్లు కలిపితే ఏమవుతుంది?
రవి: పెద్ద గొడవవుతుంది టీచర్!

రాధ: నీ చేతి రాత ఇంత చెత్తగా ఉంది అయినా ఇన్ని మార్కులు ఎలా వచ్చాయి రా?
లడ్డు: అలా రాయబట్టే పరీక్షల్లో నా తప్పులు పట్టుకోలేదక్కా!

- **పి.వి.రమణకుమార్,** చిలకలూరిపేట

చిలిపి ప్రశ్న

తక్కువ, ఎక్కువకు తేడా ఏంటి?

- **జి.డి.ఆర్. పట్నాయక్,** ఖమ్మం

అవే పదాలు

ఆధారాలతో తెలుగు పదాలను గడుల్లో రాయండి. అడ్డంగానైనా, నిలువుగానైనా అవే పదాలు వస్తాయి

1. SMOOTH			
2. FOREHEAD			
3. WORM			

- **ఎం.వి.కృష్ణసమీరా,** బెంగళూరు

అక్షరాలా బొమ్మ



జవాబులు: **చిలిపి ప్రశ్న:** మొదటి అక్షరం! **అవే పదాలు :** 1. నునుపు 2. నుదురు 3. పురుగు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45 ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: ఈ వారం గ్రహఫలం... వీధిపోటు దోషం తొలగడానికి గణేశ శ్రీవాస్తు రీత్యా ఏం చేయాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: పాడుతా తీయగా (రిపీట్), 10-30: జబర్దస్త్ (కామెడీ షో) (రిపీట్), 11-30: జబ ర్దస్త్ జల్సా టైం (రిపీట్).

మధ్యాహ్నం

12-00: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో... (రిపీట్), 01-00: ఢీ-10 (డాన్స్ షో) (రిపీట్), 02-15: టెలివిజన్ తెరపై తొలిసారిగా... అమీతుమీ... (అడవి శేషు, ఈషు).

సాయంత్రం

05-00: పుష్పక విమానం: (ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రయాణం...), 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 6-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సా టైం (రిపీట్)07-00: స్వరాభిషేకం: సుమధుర కవులకు రమణీయ రాగాంజలి...

రాత్రి

09-00: ఈటీవీ న్యూస్, 9-30: పాడుతా తీయగా: (చిరుగజ్జెల స్వర సమరం), 10-30: స్పెషల్ ఫిల్మ్‌బేస్డ్ ప్రోగ్రాం: 'రాజుగారి హీరోయిన్' – కథానాయికలు కాజల్, కేథరిన్ చెప్పిన సరదా కబుర్లు..., 11-00: స్పెషల్ మూవీ: నీతో (సూర్యప్రకాష్, మెహక్).

ఈటీవీ ప్లస్

మధ్యాహ్నం

11:00 పోవే..పోరా రిపీట్
12:00 ఎక్స్‌ప్రెస్ రాజా బ్యాండ్ బాజా
01:00 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్ రిపీట్
02:00 పటాస్ పంచెస్ రిపీట్
03:00 ఈ-జంక్షన్ రిపీట్

సాయంత్రం

04:00 పటాస్ రిపీట్
05:00 సండే కామెడీ మూవీ.. 'శుభాకాంక్షలు'

రాత్రి

07:30 పటాస్ పంచెస్ రిపీట్
08:30 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్
09:30 నా షో నా ఇష్టం రిపీట్
10:30 సినిమా చూపిస్త మావ రిపీట్
11:30 పటాస్ రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ యోగమంత్ర (ఉ. 6:00)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 06:30, 07:00, 07:30, సా 05:00, 05:30,06:00)
- ★ అమృతం - (ఉ. 8:00, 12:30, రా. 8:00, 10:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 1:00, రా. 08:30, 10:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, 10:30, సా. 4:00, రా. 7:00)
- ★ డా.ఈటీవీ - (ఉ. 9:30, 11:00, మ. 3:30, సా. 6:30)
- ★ మానస (ఉ. 10:00, మ. 12:00, 1:30, రా. 7:30)
- ★ హోమియో (మ. 2:00)
- ★ ఆయుష్ (మ. 2:30)
- ★ అందరికి ఆరోగ్యం (మ. 3:00)
- ★ బాడీ మైండ్ & సోల్ – అంతరంగం (రా. 9:00, 11:00)
- ★ బాడీ మైండ్ & సోల్ – సుఖజీవనం (రా. 9:30,11:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు 7-00: సన్‌రైజ్ సినిమా: కాలాంతకులు (శోభన్‌బాబు, జయసుధ), 10-00: మార్నింగ్ షో: ఇరుగు – పొరుగు (ఎన్టీఆర్, కృష్ణకుమారి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: నువ్విలా (హవీష్, యామీగౌతమ్), సాయంత్రం: 4-00: ఈవినింగ్‌షో: హేమాహేమీలు (కృష్ణ, ఏఎన్నార్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: ప్రజానాయకుడు (కృష్ణ, కాంచన), 10-00: అపురూపచిత్రాలు: నటరత్న ఎన్టీఆర్, జమున నటించిన మహత్తర జానపద కథా చిత్రం 'ఏకవీర' విశేషాలు....

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - స్పినాచ్ బేసిల్ క్రీప్స్ & సొరకాయ తెలగపిండి రైస్, ఉ.8.30: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్స్) – ప్రాన్స్ తెంపుర & యెకిసొబ్బ చికెన్ నూడుల్స్, ఉ.9.30: గోరుముద్దలు – టమాటో కోకోనట్ సూప్, ఉ.11.00: బాబాయ్ హోటల్ – వాక్కాయ పప్పు & వాక్కాయ రోటి పచ్చడి, ఉ.11.30: సూపర్ చెఫ్ - దొండకాయ చట్నీ & అవకాడొ చపాతీ రోల్, మ.12.00, రా.8:30: సూపర్ భీమ్ - గేమ్‌షో, మ.1.00: అతిథి - ఇంటింటి నేస్తం, మ.1.30, రా.10.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.2.00: చోటా చెఫ్ - చికెన్ విత్ ఎగ్ ఫ్రై, మ.2.15: పిండివంటలు, ప్రసాదాలు - శెనగపిండి తీపి ఉండ్రాళ్ళు & వడమల వడలు, మ.2.45: పదండి విందుకు – ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.3.15, రా.7.30: డిజైనర్ డిష్ – సఫేద్ చికెన్, మ.3.30: మా ఊరి రుచులు – బీరకాయ హల్వా & ఉలవచారు బిర్యాని, సా.5.00: స్నాక్స్ – బ్రెడ్ దహీ వడ, రా.7.00: మమ్మీస్ కిచెన్ – జొన్న దోస, రా.7.15: సెలబ్రేషన్స్ (కేక్ స్పెషల్స్) – మెక్సికన్ హాట్ చాక్లెట్ కేక్, రా.8.00: బ్రేక్ ఫాస్ట్ షో – అవకాడొ క్రీప్స్ & తెలగపిండి మిక్స్డ్ వెజిటబుల్ ఊతప్పం.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-30 అంతర్యామి, 08-30 యువ, 09-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: **అమ్మాయిలకే అందలం,** 01-00 ఈటీవీ 360 ^{0}, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: వంటనూనె... ఏది మంచిది? **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30: తీర్థయాత్ర: **ప్రసన్న గణపతి సిద్ధా దేవాలయం, ఓమాహ, అమెరికా,** 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-30 ఈటీవీ 360 ^{0}, 09-00: మార్గదర్శి: **విరాట్ కోహ్లి,** 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-30 అంతర్యామి, 08-30 యువ, 09-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: **అమ్మాయిలకే అందలం,** 01-00 ఈటీవీ 360 ^{0}, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30: తీర్థయాత్ర: **శ్రీ మహాగణపతి ఆలయం, సిరిసి, ఉత్తర కన్నడ జిల్లా, కర్ణాటక,** **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **వంటనూనె... ఏది మంచిది?** 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-30 ఈటీవీ 360 ^{0}, 09-00: మార్గదర్శి: **విరాట్ కోహ్లి,** 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 27-08-2017

ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు సమాహారం, 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - సూర్యభగవాన్, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 భగవద్గీత - బాలవికాసం, 11-00 వెంకటేశ్వర వైభవం, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 సినిమా, **సాయంత్రం:** 04-30 వివిధ రూపాలలో గణపతి, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు + లక్ష్మీగద్యం, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + భవయామి రఘురామం, 08-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, 09-30 గణాధిపతి - నృత్యరూపకం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీగణేశసహస్రం, 06-30 శ్రీలక్ష్మీ సహస్రం, 07-00 అర్చన, 07-30 మంత్రపుష్పం, 08-00 గణపతి దర్శనం, 08-30 వారఫలం, 09-30 జై..జై.. గణేశా (లైవ్), 11-00 ధర్మసందేహాలు, 11-30 వేదం..జీవననాదం, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-30 శ్రీగణేశ సహస్రం, 06-00 శ్రీలక్ష్మీసహస్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 జై..జై.. గణేశా (లైవ్), 08-00 వారఫలం, 09-00 ధర్మక్షేత్రం, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — ఉదయం: 06-30 టెలీ షాపింగ్, 07-30 శ్రీకరం శుభకరం, 08-00 డా.సుభాష్ చంద్ర షో, 09-00 సినిమా: అఆ, మధ్యాహ్నం: 12-00 ఈవెంట్ – అప్సరా అవార్డ్స్ రిపీట్, 03-00 సినిమా: శ్రీమంతుడు, సాయంత్రం: 06-00 సినిమా: డోర, 09-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా, 10-00 బిగ్ సెలబ్రిటీ ఛాలెంజ్-ఇంటర్నేషనల్-2017 రిపీట్, 11-00 పోలీస్ డైరీ.

మా — **ఉదయం:** 07-00 ఫిల్మ్‌బేస్డ్, 07-30 ఫన్ టైమ్, 08-00 రాశి ఫలాలు, 09-00 సినిమా: అదుర్స్, **మధ్యాహ్నం:** 12-00 సినిమా: సన్/o సత్యమూర్తి, 03-00 సినిమా: సినిమా చూపిస్తా మావ, **సాయంత్రం:** 06-00 సినిమా: సింగమ్3, 09-00 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ (రిపీట్).

జెమిని — **ఉదయం:** 06-00 శ్రీ కరుణామయి దేవి వైభవం, 06-30 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 సినిమా: వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, 10-00 సైమా కర్టన్ రైజర్, 11-00 సినిమా:నువ్వొస్తానంటే నేనొద్దంటానా, **మధ్యాహ్నం:** 02-25 సినిమా : శ్రీరస్తు శుభమస్తు, **సాయంత్రం:** 05-35 సినిమా: గోవిందుడు అందరివాడేలే, **రాత్రి:** 08-30 నం.1 యారి విత్ రానా, 10-30 సినిమా: రెబల్.

HBO — ఉదయం: 06-00 ప్యాసింజర్ 57, 07-34 పాన్, 09-21 కుంగ్ ఫూ పాండా 2, 10-57 జాక్ రీచర్ : నెవర్ గో బ్యాక్, మధ్యాహ్నం:01-00 ది కంజ్యూరింగ్ 2, 03-00 ట్రిపుల్ ఎక్స్, సాయంత్రం: 05-08 సూసైడ్ స్క్వాడ్, రాత్రి: 07-15 ది లెజెండ్ ఆఫ్ టార్జాన్, 09-00 ది కంజ్యూరింగ్ 2, 11-00 10,000 బీసీ

STAR MOVIES — ఉదయం: 06-01 టర్మినేటర్ సాల్వేషన్, 08-20 క్లౌడీ విత్ ఏ ఛాన్స్ ఆఫ్ మీట్‌బాల్స్ 2, 10-18 పెంగ్విన్స్ ఆఫ్ మడగాస్కర్, మధ్యాహ్నం: 12-06 ది అమేజింగ్ స్పైడర్ మ్యాన్ 2, 02-57 ఫెంటాస్టిక్ ఫోర్: రైజ్ ఆఫ్ ది సిల్వర్ సర్ఫర్, సాయంత్రం:04-50 టామ్ యమ్ గూంగ్ 2, రాత్రి:07-02 అనకొండ 3 : ఆఫ్‌స్ప్రింగ్, 09-00 టైటానిక్,

WB — ఉదయం: 06-00 స్టార్ డస్ట్, 08-14 ఇంప్రాక్టికల్ జోకర్స్, 09-19 లెగో డీసీ కామిక్స్ సూపర్ హీరోస్: జస్టిస్ లీగ్ కాస్మిక్ క్లాష్, 10-59 కిల్లర్స్, మధ్యాహ్నం: 12-43 ది 33, 02-50 డేస్ ఆఫ్ థండర్, సాయంత్రం: 04-40 ప్రీస్ట్, 06-08 ది డార్క్‌నైట్ రైజెస్, రాత్రి: 09-00 ది యానిమల్, 10-23 ది హాబిట్: యాన్ అన్ఎక్స్‌పెక్టెడ్ జర్నీ.

Z CINEMA — ఉదయం: 07-21 జర్నీ బాంబే టు గోవా, 10-35 హ్యాపీ న్యూ ఇయర్, మధ్యాహ్నం: 02-31 వివాహ్, సాయంత్రం: 06-04 ధమాల్, రాత్రి: 09-00 ఫిర్ హేరా ఫేరీ.

అక్షిత గ్రాండ్ హోటల్ సీజ్

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిలో అనధికారికంగా నిర్మించిన అక్షిత గ్రాండ్ హోటల్‌ను జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు శనివారం సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు హోటల్‌పై చర్యలు తీసుకున్నట్లు జోన్-5 ఏసీపీ పి.నాయుడు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతో గత జూన్‌లో జీవీఎంసీ ఆక్రమణలు తొలగించింది. దీంతో హోటల్ స్థల యజమాని హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో జీవీఎంసీ అప్పీలుకు వెళ్లింది. వాదోపవాదనల తర్వాత హైకోర్టు అనధికార నిర్మాణాన్ని సీజ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో దువ్వాడ పోలీసులు బందోబస్తు మధ్య హోటల్‌ను సీజ్ చేశారు. హోటల్ స్థలంలో ఎటువంటి కార్యకలాపాలైనా చేపడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తెరపై ఈనాడు

అర్జున్‌రెడ్డి : కిన్నెర, మెలోడి, ఎస్టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-3 (11.00, 2.30)
వివేకం : సంగం, కామేశ్వరి, విమాక్స్-3, లీలామహల్, శ్రీలక్ష్మినరసింహ స్క్రీన్-2, ఎస్టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-3 (6.30, 9.45)
ఆనందో బ్రహ్మ: శారద, విమాక్స్-2, శ్రీకన్య, ఎస్టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-2
విఐపి-2: శ్రీవెంకటేశ్వర, గోకుల్, పరమేశ్వరి పిక్చర్ పేలస్
ANNABELLE: CREATION: రమాదేవి (3.00)
A GENTLEMAN - SUNDAR SUSHEEL RISKY: రమాదేవి (11.00, 6.30, 10.00)
నేనే రాజు నేనే మంత్రి: జోతి, శ్రీరామ, ఊర్వశి, ఎస్టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-1 (6.50, 9.50)
జయ జానకి నాయక: శరత్, విమాక్స్-1, శ్రీలక్ష్మినరసింహస్క్రీన్-1
లై: వెంకటేశ్వర, **ఫిదా :** జగదాంబ

చికెన్ ధరలు

బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్: 90; డ్రెస్డ్: 150; స్కిన్‌లెస్: 160.
వెన్‌కాబ్: ఫారం గేటు ధర: 79; లైవ్: 93; డ్రెస్డ్: 137; స్కిన్‌లెస్: 153.
(కిలోకి – రూపాయలలో)

పోలీసు వాహనం దుర్వినియోగం... కానిస్టేబుల్ సస్పెన్షన్

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం సమకూర్చిన పోలీసు వాహనాన్ని స్నేహితుడికిచ్చి దుర్వినియోగం చేసినందుకు కానిస్టేబుల్‌ను నగర పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ఈశ్వరరావు రెండు రోజుల క్రితం ప్రభుత్వం సమకూర్చిన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఇంతలో అతని స్నేహితుడు ఎదురుపడి ఒకసారి పోలీసు వాహనాన్ని నడిపి చూస్తానని కోరడంతో... మొహమాటానికి ద్విచక్ర వాహనాన్ని ఇచ్చాడు. కొందరు ఈ దృశ్యాన్ని ఫొటోలు తీసి నగర సీపీకి వాట్సాప్‌లో పంపించారు. దీనిపై విచారణ చేసిన సీపీ యోగానంద్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విశాఖలో స్థిరాస్తి వ్యాపారం వృద్ధి చెందుతోంది

స్టీల్ ప్లాంట్ సిఎండీ మధుసూదన్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశాఖ మహానగరంలో స్థిరాస్తి వ్యాపారం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని స్టీల్‌ప్లాంట్ సీఎండీ మధుసూదన్ పేర్కొన్నారు. హిందూ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్‌లోని గేట్‌వే హోటల్‌లో రెండు రోజుల పాటు జరగనున్న ది హిందూ లివింగ్ స్పేసెస్ -2017 ప్రదర్శనను మధుసూదన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్థిరాస్తి వ్యాపారం, విశాఖ అభివృద్ధి తదితరాలపై ప్రసంగించారు. ప్రోపర్టీ షోలో రియల్ ఎస్టేట్ రంగంలో ప్రముఖమైన 16 సంస్థలు పాల్గొన్నాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శించే అవకాశం కల్పించారు. ఆదివారంతో ఈ ప్రదర్శన ముగియనుందని ది హిందూ సీనియర్ ఏజీఎం (ప్రకటనలు) జి.శ్రీనివాస రావు తెలిపారు. జి.సాంబశివరావు, రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు నోవోటెల్‌లో వంటల పోటీలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: హిందూ దినపత్రిక ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్‌లోని నోవోటెల్ హోటల్‌లో వంటల ప్రదర్శన నిర్వహించనున్నట్లు పత్రిక సీనియర్ ఏజీఎం (ప్రకటనలు) జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ఇళ్ల వద్దే వంటలను తయారు చేసి తీసుకొచ్చి ఇక్కడ ప్రదర్శించవచ్చన్నారు. శాఖాహారం, మాంసాహారం, తినుబండారాలు తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. హోటల్ చెఫ్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని.. ప్రతి విభాగంలోనూ బహుమతులు అందిస్తామన్నారు.

ఏయూ ప్రత్యేక డ్రైవ్ పరీక్షలు వాయిదా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ నెల 28 నుంచి నిర్వహించదలచిన ప్రత్యేక డ్రైవ్ పీజీ, సెప్టెంబరు 6 నుంచి నిర్వహించాల్సిన డిగ్రీ ప్రత్యేక డ్రైవ్ పరీక్షలను వాయిదా వేసినట్లు ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్.హనుమంతురావు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామన్నారు. ఏయూ వెబ్‌సైట్‌లో పరీక్షల తెదీలను చూసుకోవచ్చునని తెలిపారు.

ఏపీ పీఎస్ఎ స్టేట్ కో ఆర్డినేటర్‌గా సూర్యనారాయణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ స్టేట్ కౌన్సిల్ కోఆర్డినేటర్‌గా సూర్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. శనివారం స్టేట్‌వైస్ ప్రెసిడెంట్ సుందరం, అడిషనల్ జనరల్ సెక్రటరీ సీహెచ్.రాము ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.




ఉత్తర్వులు అందుకున్న సూర్యనారాయణ

మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నవంబరు 5న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులన్నారు. పరీక్ష రుసుము జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులకు రూ.50. పూర్తిచేసిన దరఖాస్తులు వచ్చేనెల 18వ తేదీలోపల ఆన్‌లైన్‌లో (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈఏపీ.ఓఆర్జీ) దరఖాస్తు చేయాలని సూచించారు.

బీసీ కార్పొరేషన్ ఈడీ మురళీకృష్ణకు బదిలీ



మురళీకృష్ణ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీకృష్ణకు అమరావతిలోని బీసీ సంక్షేమశాఖలో సహాయ సంచాలకులుగా బదిలీ అయింది. వచ్చే నెలలో ఈయన పదవీ విరమణ చేయనున్నారు. నెల రోజుల పాటు ఆయన స్థానంలో ఎస్సీ కార్పొరేషన్ ఈ.డి. మహాలక్ష్మిని ఇన్‌ఛార్జిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ట్రెజరీశాఖలో పనిచేస్తున్న గీతాదేవి విశాఖ బీసీ కార్పొరేషన్ ఈ.డి.గా వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

నగరంలో ఈనాడు

- ★ ఉదయం 9.45 గంటలకు అక్కయ్యపాలెం, ఎన్టీ స్కూల్లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి
- ★ 10.30 గంటలకు అగ్నికుల క్షత్రియ కళాక్షేత్రంలో విశాఖపట్నం మలయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం సమావేశం
- ★ సాయంత్రం 4.30 గంటలకు ఆర్కే బీచ్ ఫంక్షన్ హాల్లో రోడ్డు భద్రత ఛాలెంజ్ కార్యక్రమం
- ★ 6 గంటలకు సాగర్ ఇస్కాన్ మందిరంలో కృష్ణలీలలు సాంస్కృతిక కార్యక్రమం

తిరుమలదర్శిని

వసతి: రూ.500: అక్టోబరు 10 నుంచి డిసెంబరు 25 వరకు (అక్టోబరు 13, 14, 19, 20, 21, 22న తప్ప), రూ.100: అక్టోబరు 10 నుంచి డిసెంబరు 25 వరకు (అక్టోబరు 13, 14, 19, 20, 21, 22న తప్ప), రూ.50: ఖాళీలు లేవు, శ్రీనివాసం (రూ.200): అక్టోబరు 10 నుంచి డిసెంబరు 25 వరకు(అక్టోబరు 13, 14, 19, 20, 21, 22న తప్ప), దర్శనం: రూ.50: ఖాళీలు లేవు, రూ.300 (శీఘ్రదర్శనం): సెప్టెంబరు 6 నుంచి నవంబరు 30 వరకు (సెప్టెంబరు 19, 23, 27, 29, 30, అక్టోబరు 1, 6, 7,8, 13, 14న తప్ప) ఖాళీలున్నాయి.

నోట్: దర్శన, వసతి వివరాలు : . ఆగస్టు 29 నుంచి డిసెంబరు 25 వరకు గల సమాచారం మాత్రమే

కల్యాణ మండపం: తితిదే కల్యాణ మండపం సెప్టెంబరు 10 వరకు ఖాళీలున్నాయి.

ప్రతీ మంగళవారం సెలవు

ఫోన్ నంబర్: తి.తి.దే. కల్యాణ మండపం: 2550265

వెబ్‌సైట్: ttdsevaonline.com


చిత్రం.. మరో ప్రపంచం చూపించే..



బాల్యం.. వృద్ధాప్యం.. రెండూ ఒకటే



పల్లె వాకిట.. ప్రకృతి సేద్యం



అకృత్యాలకు సజీవ రూపం..



ప్రదర్శనను తిలకిస్తున్న రవిప్రకాష్, శ్రీనివాసులునాయుడు, తదితరులు


పర్యాటకానికి అనుబంధంగా ఛాయాచిత్రాల ప్రదర్శన ఉంటే మరింత బాగుంటుందని జీసీసీ ఎండీ ఎ.ఎస్.పి.ఎస్.రవిప్రకాష్ పేర్కొన్నారు. విశాఖ కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్‌లోని హవామహల్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ డిజిటల్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ శనివారం సాయంత్రం జీసీసీ ఎండీ ఎ.ఎస్.పి.ఎస్. రవిప్రకాష్ ప్రారంభించారు. 330 మందికిపైగా అరుదైన, అవార్డులు పొందిన ఛాయా చిత్రాలను ప్రదర్శించారు. టూరిజం ఈడీ శ్రీనివాసులునాయుడు, బి.కె.అగర్వాల్, ప్రబల మహంతి, దేబిదాస్ బెనర్జీ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే,ఏయూ ప్రాంగణం



సాయం సంధ్యవేళ.. గూటికి చేరుతూ



చేపా..చేపా.. ఎందుకు ఎండలేదు..



రాత్రి వేళ చూడాలి..
నగర నఖశిఖరం

కనకమహాలక్ష్మికి బంగారు కిరీటం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ నగరానికి చెందిన ఒక అజ్ఞాత భక్తుడు కనకమహాలక్ష్మి అమ్మవారికి 281 గ్రాముల బరువైన బంగారు కిరీటాన్ని శుక్రవారం విరాళంగా ఇచ్చారు. పాతనగరానికి చెందిన ఆ భక్తుడు వృత్తిరీత్యా ముంబయిలో స్థిరపడ్డారు. సుమారు రూ. 8 లక్షలు ఖర్చు చేసి దీన్ని కొనుగోలు చేశారు. ఆ కిరీటాన్ని అమ్మవారికి ధరింపచేసి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు కిరీటం బహూకరణ కార్యక్రమంలో ఈవో జ్యోతి మాధవి, ట్రస్టు బోర్డు ఛైర్మన్ డబ్ల్యు.భాస్కరరావు, ట్రస్టీలు చంద్రరావు, చలపతిరావు, వెంకటరమణ, డీఈఈ సి.హెచ్.వి.రమణ, ఏఈఓలు వి.రాంబాబు, పి.రామారావు, సూర్యకుమారి, పర్యవేక్షకులు రాజు పాల్గొన్నారు.





బంగారు కిరీటంతో కనకమహాలక్ష్మి అమ్మవారు, (అంతర చిత్రంలో) బంగారు కిరీటం

ఆధ్యాత్మిక గురువు సైఫుద్దీన్ రాక

ఎండాడ ముబారక్ కాలనీలో సందడి





మత గురువును దర్శించడానికి తరలివచ్చిన ముస్లింలు; ఆశీర్వచనాలు పలుకుతున్న మత గురువు సైఫుద్దీన్ (అంతర చిత్రం)

ఎండాడ, న్యూస్‌టుడే: ముస్లింల ఆధ్యాత్మిక గురువు, దావూదీ బోహ్రా తెగ నాయకుడు డాక్టర్ సయ్యదనా ముఫదల్ సైఫుద్దీన్ శనివారం ఎండాడ ముబారక్ కాలనీకి వచ్చారు. ఆయన రాకతో పండగ వాతావరణం నెలకొంది. ఐదు రోజుల పాటు సామాజిక, సామూహిక ఇతిహాస కార్యక్రమాల నిర్వహణకు ఆయన కొలంబో నుంచి వచ్చిన ఆయనకు కార్యక్రమ నిర్వాహకులు ఎస్.కె.ముస్తాఫా జోహార్, ఎం అబ్బీర్ మద్రాస్‌వాలా, ఎం. జాఫర్ మసాలియా అఖిల్‌రాజా తదితరులు ఘన స్వాగతం పలికారు. వారందరినీ మత గురువు ఆశీర్వదించారు. కార్యక్రమ నిర్వాక ప్రతినిధి ముస్తాఫా జోహార్ మీడియాతో మాట్లాడుతూ... ముబారక్ కాలనీలో ఐదు రోజుల పాటు ఈద్ తరహాలో ఇతిహాస కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చెన్నై, ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన పదివేల మంది ముస్లింలు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. వారందరికీ భోజన, వసతి సదుపాయాలను సమకూరుస్తున్నామని చెప్పారు. సామూహిక వివాహాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, పచ్చదనం, స్వచ్ఛభారత్, ఇస్లామిక్ సంప్రదాయాలు తదితర కార్యక్రమాలను మత గురువు చేతుల మీదుగా నిర్వహిస్తామని తెలిపారు. బోహ్రా తెగ వ్యాపారపరంగా అభివృద్ధి చెందడానికి చేపట్టాల్సిన అంశాలపై ఆయన అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ప్రపంచ పోటీలకు పయనమైన స్కేటర్లు

ఎం.వి.పి.కాలనీ: బీజింగ్‌లో ఈ నెల 28 నుంచి జరిగే ప్రపంచ రోలర్ స్కేటింగ్ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు చైనా పయనమయ్యారు. అన్మిష, వేణువర్ధన్, కిరణ్, అరుణ్, ఫర్హీన్, విశ్వేశ్వరరావు, సాత్విక్, ప్రియం తాటెడ్, రియా సాబు తదితరులు దిల్లీలోని ప్రత్యేక సన్నాహక శిబిరంలో శిక్షణ తీసుకున్నారు. వీరితో పాటు కోచ్‌లు సత్యం, పవన్‌కుమార్, సింహాద్రి కూడా బయలుదేరారు.



బీజింగ్ ప్రపంచ పోటీల్లో పాల్గొనే నగర క్రీడాకారులు



జిమ్‌లో కసరత్తుల అనంతరం దేశంలోని వివిధ డివిజన్‌లకు చెందిన రైల్వే క్రికెటర్లు

తూ.కో. ఆధ్వర్యంలో రంజీట్రోఫీకి
రైల్వే క్రీడాకారులకు శిక్షణ

విశాఖ క్రీడలు: తూర్పుకోస్తా రైల్వే ఆధ్వర్యంలో తొలిసారిగా రంజీట్రోఫీలో ఆడే క్రీడాకారులను ఎంపిక చేసే నిమిత్తం దేశంలో వివిధ రైల్వే డివిజన్లలో విధులు నిర్వహిస్తోన్న రైల్వే క్రీడాకారులకు శిక్షణ శిబిరం (కండిషనింగ్ క్యాంప్) రైల్వే స్టేడియంలో ప్రారంభమైంది. డీఆర్‌ఎం ఎం.ఎస్.మాథుర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని శిబిరాన్ని ప్రారంభించారు. వచ్చే నెల 1వ తేదీ వరకూ శిబిరం జరుగుతుంది. దేశం నలుమూలల నుంచి 60 మంది రైల్వే క్రికెటర్లు ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. వీరందరికీ విశాఖ రైల్వేలో విధులు నిర్వహిస్తోన్న వంకా మురళీ ఫిజియోగా వ్యవహరిస్తున్నారు.

ఈనాడు - ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు

ఎక్స్‌పోర్ట్ - ఇంపోర్ట్ బిజినెస్ వర్క్‌షాప్

విశాఖపట్నం: ఈనాడు - ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఎక్స్‌పోర్ట్ - ఇంపోర్ట్ బిజినెస్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు.

ఫీజు : రూ. 9500/-

శిక్షణ కాలం: 3 రోజులు (సెప్టెంబరు 1, 2, 3 తేదీలు)

సమయం: ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు.

శిక్షణ స్థలం : డాల్ఫిన్ హోటల్, డాబా గార్డెన్స్, విశాఖపట్నం.

- రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ ఈ నెల 31.

వివరాలకు **8008500280, 9618775577** నంబరులో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చు.

ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు VSP2 అని స్పేస్ ఇచ్చి మీ పూర్తి పేరు టైప్ చేసి **56263579** కు SMS చేయండి. ఉదా: VSP2 B.SRINIVAS